# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




## సంక్రాంతి సంబరాలకు 'నారావారి రాక'

రంగవళ్ళులు, పచ్చదనంతో ఆహ్వానం



చంద్రగిరి, జనవరి 12 ప్రభాతవార్త: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి సంక్రాంతి సంబరాలకు తమ సొంతూరు నారావారిపల్లికి శుక్రవారం చేరుకున్నారు. సంస్కృతీ సంప్రదాయాలను అనుసరించి స్వగ్రామంలో సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం కోసం నారా భువనేశ్వరి, లోకేశ్వరి, ఉమామహేశ్వరి కుటుంబాలు ఇక్కడికి చేరుకున్నారు. అదేవిధంగా నారా బ్రాహ్మిణి, నారా దేవాన్ష్ శనివారం వస్తున్నారు. టిడిపి అధినేత నారా చంద్రబాబు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదివారం రానున్నారు. కరోనా నేపథ్యంలో కొంత విరామం రావడంతో 2024 సంక్రాంతి సంబరాలు నారావారిపల్లిలో జరుపుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. నారావారి నివాసాన్ని సంక్రాంతి కోసం శుద్ధిచేసి, నివాస ఆవరణలో రంగు రంగుల రంగవళ్ళులను అందంగా తీర్చిదిద్దారు. అదేవిధంగా ఇంటి ఆవరణలో ఆహ్లాదకర వాతావరణం కోసం పచ్చదనంతో కూడిక మొక్కలను ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని పసుపు రంగుతో ముస్తాబు చేశారు. గ్రామంలో తెలుగుతమ్ముళ్ళు తమ అధినేత కుటుంబ సభ్యులను ఆహ్వానిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు నారావారిపల్లిని పసుపుమయం చేశాయి. నారావారి కులదైవం నాగాలమ్మ ఆలయాన్ని, తల్లిదండ్రుల సమాధుల వద్ద శుద్ధి గావించి, విశేష అలంకరణలతో తీర్చిదిద్దుతున్నారు. దీంతో నారావారిపల్లి గ్రామంలో పండుగ శోభ సంతరించుకున్నది. గ్రామంలో పార్టీ నాయకులు, విఐపిల కోసం పార్కింగ్‌లు సిద్ధం చేశారు. మధ్యాహ్నం టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు నారా భువనేశ్వరికి ఘన స్వాగతం పలికారు.

## ఓటింగ్ యంత్రాల పై అవగాహన కల్పించండి

**22న ఫైనల్ ఓటర్ల జాబితా ప్రచురణ -జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

తిరుపతి కార్పొరేషన్,జనవరి 12, ప్రభాతవార్త : ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ 2024 మేరకు జిల్లాలో అన్ని రకాల దరఖాస్తులు 415 234 అందాయని క్షేత్రస్థాయి పరిశీలనలో 70876 తిరస్కరించడం జరిగిందని, 343663 ఆమోదించడం జరిగిందని 695 దరఖాస్తులు పరిశీలనలో వున్నాయని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్‌లో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ 2024 పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో 21వ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఎప్పటికప్పుడు ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ 2024 ప్రకారం ఇంటింటి సర్వే ,దరఖాస్తుల పరిశీలన చేపట్టి పరిష్కరించడం జరిగిందని అన్నారు. జంక్, జీరో డోర్ నెంబర్లు 31073 పరిశీలనలో సాంకేతిక కారణాలతో 519 మాత్రమే ఆగివున్నాయని త్వరగా పరిష్కారం జరుగుతుందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఓటింగ్ యంత్రాల ప్రచార వాహనాలు తిరుగుతున్నాయని ప్రజలు అవగాహన నిమిత్తం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో బిజేపి పురుషోత్తం నాయుడు, టిడిపి మనోహరాచారి, వైఎస్ఆర్‌సిపి చంద్రమౌళి, ఆర్డిఓలు నిశాంత్ రెడ్డి, చంద్రముని, శివశంకర్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, కోదండరామి రెడ్డి, తహశీల్దార్ వెంకటరమణ, సెక్షన్ తహశీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## యువత పాజిటివ్ ధృక్పదంతో ముందడుగు

- కలెక్టర్ సగిలి షన్మోహన్ పిలుపు



చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

చిత్తూరు, జనవరి 12 ప్రభాతవార్త: స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని యువత పాజిటివ్ ధృక్పదంతో ముందడుగు వేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ పిలుపునిచ్చారు. డిఆర్‌డిఎ సమావేశభవనంలో శుక్రవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ జిల్లా నెహ్రూ యువకేంద్రం కో-ఆర్డినేటర్ ప్రదీప్, డిఆర్‌డిఓ పిడి డిఎంకె తులసీలతో కలిసి నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత వారి శక్తి సామర్థ్యాలను బట్టి వారికి నచ్చిన వ్యక్తిలోని కొన్ని అంశాలను పాజిటివ్‌గా తీసుకొని ముందుకు వెళ్ళాలని, అప్పుడే వారు జీవితంలో ఎద్దైనా సాధించగలుగుతారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది యువత స్వామి వివేకానందని ఆదర్శంగా తీసుకొంటున్నారన్నారు. యువత దేశాభివృద్ధికి పాటు పడాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా నెహ్రూ యువకేంద్రం కో-ఆర్డినేటర్ ప్రదీప్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువత ఓటర్లుగా నమోదు కావాలని సూచించారు. దేశ అభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషిస్తోందన్నారు. డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ మాట్లాడుతూ యువత స్వామి వివేకానందని ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. యువత 25 సంవత్సరాలకల్లా ఒక లక్ష్యం నిర్ధేశించుకొని దానిని చేరుకోవాలన్నారు. మన దేశంలోని ఆధ్యాత్మిక విషయాలు, సనాతన ధర్మం గురించి వివేకానంద యువతకు వివరించారన్నారు. వివేకానంద యువతకు ఇచ్చిన ప్రేరణ ఇచ్చే సూక్తులు, స్ఫూర్తివంతమైన సందేశాలను నేటి యువత చదివి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో కలెక్టర్ సగిలి షన్మోహన్ జ్యోతి ప్రజ్వలన చేసి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు, ఎన్‌జిఓలకు కలెక్టర్ మెమెంటోలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిజెఎం సరిత, నెహ్రూ యువకేంద్రం అకౌంట్స్ ఆఫీసర్ బాబురెడ్డి, చిత్తూరు జిల్లాలోని ఎన్జీఓలు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో మౌళిక వసతుల కల్పనపై దృష్టి

**- నేటి సాయంత్రంలోపు నివేదిక - కలెక్టర్ సగిలి షన్మోహన్ సెక్టోరియల్ అధికారులకు ఆదేశం**




సెక్టోరియల్ అధికారులు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్

చిత్తూరు, జనవరి 12 ప్రభాతవార్త: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో పోలింగ్ కేంద్రాలుగా వినియోగించే పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అన్ని మౌళిక వసతులు వుండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జడ్పీ సమావేశభవనంలో శుక్రవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ పోలింగ్ కేంద్రాల్లో మౌళిక వసతుల కల్పనపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో మౌళిక వసతులు కల్పనపై తహసిల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు పూర్తి బాధ్యత వహించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల్లో మౌళిక వసతుల కల్పనపై సమగ్ర శిక్ష ఎపిసి, పంచాయతీరాజ్ ఎస్ఇలను సమన్వయం చేసుకొని పనులు పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీరు, ఫర్నిచర్, విద్యుత్, లైట్లు, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు సక్రమంగా వుండేలా చూడాలన్నారు. అలాగే విభిన్న ప్రతిభావంతులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్ళడానికి వీలుగా ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఇఆర్‌ఓలు, ఎఇఆర్‌ఓలు సెక్టోరియల్ అధికారులతో సమన్వయం చేసుకొని ఎక్కడ మౌళిక వసతులు అవసరమో గుర్తించి ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈనెల 22న ఓటర్ల తుది జాబితా విడుదల చేయడం జరుగుతుందని, ఎన్నికల నిర్వహణలో దోష రహిత ఓటర్ల జాబితా కీలకమని అలాంటి జాబితా తయారీలో రాజకీయ పార్టీల నుండి వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా పరిష్కరించాలని, నిష్పక్షపాతంగా, బాధ్యతా యుతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ ఎస్.రాజశేఖర్, ఇఆర్ఓలు, ఎఇఆర్ఓలు, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, సమగ్ర శిక్ష ఎపిసి వెంకటరమణారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రరావు, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి, జిల్లా మత్స్యశాఖ డిడి శ్రీనివాసరావు, మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ, చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, పలమనేరు ఆర్డీఓ మనోజ్‌కుమార్‌రెడ్డి, నగరి ఆర్డీఓ సృజన, కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు, ఐసిఓఎల్ డిప్యూటీ కలెక్టర్ భవానీ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, తహసిల్దార్లు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

## గూడూరులో జయహో బిసి సదస్సు



గూడూరు, జనవరి 12 ప్రభాతవార్త : గూడూరు పట్టణం, రూరల్ మండల పరిధిలోని బిసి నాయకులతో పార్టీ కార్యాలయంలో బిసి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం స్వర్గీయ ఎన్‌టిఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించి బిసిలకు అధిక ప్రాముఖ్యతను కల్పించారు. అనంతరం చంద్రబాబు నాయుడు బిసిలకు వెన్నుదన్నుగా ఉంటూ అధిక ప్రాధాన్యతను కల్పించారు. ఎన్నికల సమయంలో అందరికి సమన్యాయం చేస్తానని మోసపూరిత మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత అందరిని రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందన్నారు. 75760 కోట్ల బిసి సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించింది. 30కి పైగా బిసి సంక్షేమ పథకాలను రద్దు చేశారు. 34 శాతం నుండి 24 శాతంకు తగ్గించి 16800 పదవులను బిసిలకు దూరం చేసింది ప్రభుత్వం, 14 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు కబ్జా చేసి, 70 వేలకు పైగా బిసి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయకుండ మోసం చేసింది. పేరుకు బిసిలకు మంత్రి పదవులు ఇచ్చి మొత్తం ఒక సామాజిక వర్గం చేతిలో ఉంది. రాబోయే ఎన్నికలలో చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేసుకుంటేనే అన్ని కులాల వారికి సముచిత న్యాయం జరుగుతుందని అన్నారు. అనంతరం గంగిరెద్దులుతో పాటు బీసీ కుల వృత్తుల పరికరాల ప్రదర్శన విన్యాసాలతో సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిసి కమిటీ సభ్యులు మునుస్వామి, గురవా రెడ్డి, రజక సాధికార సభ్యులు శంకర్, పార్లమెంట్ బిసి అధ్యక్షులు రుద్రకోటి సదాశివం, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు, కొండూరు వెంకటేశ్వర్లు రాజు, జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచు రామయ్య, రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, గౌడ సాధికార సబ్యులు ధనంజయ గౌడ్, పార్లమెంట్ బిసి సభ్యులు కోకొల్లు మదు యాదవ్, పిల్లెల శ్రీనివాసులు, నియోజకవర్గ బిసి అధ్యక్షులు కందల బాలకృష్ణ యాదవ్, గూడూరు పట్టణ మండల బిసి సభ్యులు, కార్యకర్తలు, టిఎన్ఎస్‌ఎఫ్ సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే..రాష్ట్ర భవిష్యత్తు : మాజీ మంత్రి

గంగవరం, జనవరి 12, ప్రభాతవార్త : రాష్ట్రంలో వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, పేద, మధ్య తరగతి ప్రజలపై విద్యుత్,గ్యాస్ సిలిందర్,డీజల్,పెట్రోల్ మొదలగు నిత్యవసర సరుకులు పెను భారంగా మారాయని చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు అని మాజీ మంత్రి అమరనాథరెడ్డి తెలిపారు.తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మూడవ రోజు మండలంలోని గంగవరం పంచాయతీ పరిధిలోని మన్నారునాయనిపల్లె, నడింపల్లె,మొరవిండ్లు, పాతూరు, రెంటకుంట్ల, బీడి కాలనీ,డ్రైవర్స్ కాలనీలలో ఆయన పర్యటించారు.ఈ నేపథ్యంలో మండలాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆయన ప్రజలతో మమేకమై బాబు ష్యూరిటీ..భవిషత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్ళి తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో విడుదల చేసిన మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ అంశాలను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 5 కోట్ల మంది ప్రజల భవిష్యత్తుకు చంద్రబాబునాయుడు గ్యారంటీ అన్నారు.మహాశక్తి ద్వారా 18 ఏళ్ళు నిండిన మహిళలకు ఆడబిడ్డ నిధి కింద రూ.1500,తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదువుతున్న ఏడాదికి ఒక్కొక్కరికి రూ.15వేలు అందిస్తామన్నారు. దీపం పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలీండర్లు,ఉచిత బస్సు ప్రయాణం పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు టికెట్లు లేని ప్రయాణ సౌకర్యం,అన్నదాత పథకం ద్వారా ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు అందింస్తూ యువగళం పేరుతో నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తూ ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతిని అందిస్తారని,బిసీలకు రక్షణ చట్టాన్ని తీసుకువచ్చి వారికి అన్ని విధాల అండగా నిలుస్తూ పేదలను సంపన్నులను చేస్తూ ఐదేళ్ళలో పేదల ఆధాయాన్ని రెట్టింపుకు చంద్రబాబు గ్యారంటీ అన్నారు.వైసీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగన్నర సంవత్సరాలు అవుతున్నా కూడా రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో కీలపట్ల సర్పంచ్ చంద్రశేఖర్,అడ్వకేట్ సుబ్బరామయ్య, నాయకులు ప్రసాద్‌నాయుడు, ఆనంద, చిట్టిబాబు, వెంకటేష్‌నాయుడు, బత్తిగౌడు,మాజీ సర్పంచ్ మురళీ, చిన్నబ్బ, పరమశివ, సూరి, హరి, వసరాయగౌడు, దేవేంద్రరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, జయసింహా, ముబారక్ తాజ్, వసరాయప్ప, అశోక్,భరత్,మహిళా నాయకురాళ్ళు జయమ్మ, వరలక్ష్మీ, జనసేన నాయకులు దిలీప్,చంద్ర,రమేష్‌లతో పాటు పలమనేరు, వికోట, పెద్దపంజాణి,బైరెడ్డిపల్లె మండలాలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానమ్మకు పసిడి పుష్పాలతో అభిషేకాలు



శ్రీకాళహస్తి,జనవరి 12 ప్రభాతవార్త : తిరుపతి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి.ఒక్కొక్క రోజు ఒక్కొక్క దేవునికి నిత్యపూజలు,అభిషేకాలు ప్రత్యేక అలంకారాలు నిర్వహించటం ఆనవాయితి.ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం అమ్మవారికి 116 బంగారు పుష్పాలతో అభిషేకించారు. అంతేకాక శుక్రవారం అమ్మవారికి బంగారు చీరతో ముస్తాబు చేసి వజ్రకిరీటాన్ని అలంకరించారు.ఇటీవల ఆలయానికి అతిధుల తాకిడి అధికంగా ఉంటుంది. ఆలయ ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సూచనలతో ఆలయ సిబ్బంది యుద్ద ప్రాతిపదికపై ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ధనుర్మాసం మహిళా భక్తులు విశేష సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. సాధారణం గానే శుక్రవారం అమ్మవారిని దర్శించుకొనుటకు భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. మహిళా భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు.శుక్రవారం ఆలయంలో వెలసిన దేవేరి జ్ఞాన ప్రసూనాంబఅమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితిగా ఉంది.ఈ సేవలకు భక్తుల నుంచి విశేష స్పందన వస్తుంది.

**నిత్యోత్సవం భక్తులకు సంబరం:**

శ్రీకాళహస్తీశ్వరాలయం కంచుగడప నుంచి ప్రవేశిస్తే మొదట దర్శనమిచ్చేది గురుదక్షిణామూర్తి. కుడివైపు చూస్తే మృత్యుంజయస్వామి ప్రతిష్టిత లింగం దర్శనమిస్తుంది. ఎడమవైపు నిత్యకళ్యాణోత్సవం దర్శనమిస్తుంది. ఇక శుక్రవారం ఆలయంలో నిత్యోత్సవం ప్రత్యేక ఆకర్షణ. భక్తులకు పండగే పండగ అన్నట్లు ఉంటుంది. ఆలయంలో నిత్యకళ్యాణం పచ్చ తోరణంలా పూజలు అభిషేకాలు నిర్వహించ`బడుతుంది. ఓ వైపు స్వామి అమ్మవార్లకు అభిషేకాలతో పాటు రాహుకేతుదోష నివారణ పూజలు, శనీశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు, ఇక స్వామి అమ్మవార్లకు నిత్యకళ్యాణం,మృత్యుంజయస్వామికి అభిషేకాలతో పునీతమౌతుంది.శుక్రవారం ఆలయంలో వెలసిన దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి బంగారు చీర, వజ్రకిరీటంతో పాటు సాయంత్రం బంగారు పుష్పాలతో అభిషేకం ప్రత్యేకార్షణగా మారింది.ఈ సేవలకు స్థానిక భక్తులు విశేష సంఖ్యలో పాల్గొంటారు. అయితే అమ్మవారికి బంగారుపుష్పాల అభిషేకానికి దేవస్థానం అధికారులు అంతగా ప్రచారం చేయలేదు.దాంతోఈ సేవలకు స్థానికులు మాత్రమే హాజరౌతున్నారు. అంతేకాక మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రభిషేకానికి ఇచ్చినట్లు వారంలో ఒక్క రోజు నిర్వహించే పూజలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది.

## జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి

**- గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు - ఎమ్మెల్యే అభ్యర్థిగా మేరిగ మురళీదర్ ఎంపిక సంతోషకరం**

గూడూరు, జనవరి 12 ప్రభాతవార్త : జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. వైసీపీ అభివృద్ధికి కృషి చేసే నాయకులు, కార్యకర్తలు అందరూ కోరుకున్న ఎంఎల్‌సి మేరిగ మురళీధర్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా నియమించాలని తాను కూడా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కోరానని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు తెలిపారు.గూడూరు పట్టణంలోని సొసైటీ ప్రాంతంలో ఉన్న తన నివాసంలో ఎంఎల్‌సీ మేరిగ మురళీధర్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. వీరి వెంట స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, ఎంఎల్‌సి బల్లి కల్యాణ్ చక్రవర్తి తదితరులు ఉన్నారు. కొద్దిసేపు వారు రాజకీయాలు, తదితర అంశాలపై చర్చించారు. అనంతరం మేరిగ మురళీధర్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాదరావు మాట్లాడుతూ పార్టీ కోసం మురళీ ఎంతో కష్టపడి పనిచేశారన్నారు. గత ఎన్నికల్లో పలు కారణాల వల్ల టికెట్ రాలేదని, ప్రస్తుతం నాయకులు, కార్యకర్తలు కోరిన విధంగా, తాము ఆశించినట్లు ఆయనను సమన్వయకర్తగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నియమిం చారని తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ మాట్లాడుతూ అందరి కోరిక మేరకు మేరిగ మురళీధర్‌కే సమన్వయకర్త బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే వరప్రసాదరావు ఎన్నో అభివృద్ధి పనులు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ యమునమ్మ, వైసీపీ నాయకులు బొమిడి శ్రీనివాసులు, మురళీ, గోపాల్ యాదవ్, ముని, సురేష్‌రెడ్డి, హషీమ్, రమేష్, యోగి తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపోరాటదీక్ష భగ్నం.. ముందురోజే అడ్డుకున్న పోలీసులు

**- రామచంద్రయాదవ్‌పై పోలీసు చర్య**





కృష్ణమోహన్ ఒక కార్యకర్తలు చెప్పుతో కొట్టడం వివాదాస్పదం అయింది.

పుంగనూరు, జనవరి 12 ప్రభాతవార్త: బిసివై నాయకుడు రామచంద్రయాదవ్ చదళ్ళ గ్రామం వద్ద తలపెట్టిన ధర్మపోరాటదీక్ష శిబిరంపై పోలీసులు ముందు రోజే పోలీసులు చర్యలు తీసుకుని భగ్నం చేశారు. సభ ఏర్పాట్లను పరిశీలించడానికి వచ్చిన రామచంద్రయాదవ్‌ను అదుపులోనికి తీసుకుని, అడ్డువచ్చిన కార్యకర్తలు చెదరగొట్టారు.ఈక్రమంలో రామచంద్రయాదవ్‌ను తరలిస్తున్న ఆయన కారుకు అడ్డంగా ఉన కార్యకర్తలను చెదరగొట్టే చర్యల్లో భాగంగా గంగవరం సిఐ కృష్ణమోహన్ ఒక కార్యకర్తను చెప్పుతో కొట్టి తరమడం వివాదాస్పదంగా మారింది. వివరాలిలా ఉన్నాయి. బిసివై నాయకుడు రామచంద్రయాదవ్ తనకు ఇంతవరకు జరిగిన అన్యాయానికి, తనపై జరిగిన దాడులను ప్రజలకు వివరిస్తూ, తన ధర్మపోరాటానికి ప్రజలు మద్దతు పలకాలని కోరడానికి శనివారం సాయంత్రం చదళ్ళవద్ద సభ ఏర్పాటుచేశారు. రెండురోజులుగా గ్రామంవద్ద సభ నిర్వహణకు చర్యలు చేపడుతున్నారు. యధావిధిగా శుక్రవారం మధ్యాహ్నం సభాస్థలి వద్దకు చేరుకున్నారు. కొంత సేపటికి సభాస్థలి వద్దకు వచ్చిన పోలీసులు సభ నిర్వహణ అక్రమంగా చేయడం చట్టవ్యతిరేఖమని,సమాజానికి ఇబ్బంది కలిగిస్తున్నారని పేర్కొంటూ నోటీసులు జారీ చేయడానికి యత్నించారు. అయితే స్థలం ప్రైవేట్‌వ్యక్తులకు చెందినదని,ఎవరికీ ఇబ్బంది కలిగించని రీతిలో తాను న్యాయబద్ధంగా సభ నిర్వహించడానికి ప్రయత్నిస్తుంటే నోటీసులు ఇవ్వడం సరికాదని నోటీసులు నిరాకరించారు.యాదవ్‌కు కేంద్రం ఇచ్చిన వైప్లస్ కాటగిరి సెకు ్యరిటీ సిబ్బంది, పోలీసులకు వాగ్వివాదం జరిగింది. ప్రశాంతతకు విఘ్నం కల్పిస్తున్నందున ఎటువంటి సభలు నిర్వహించడానికి వీలు లేదని పేర్కొంటూ ఆయనను పోలీసులు బలవంతంగా తరలించడానికి ప్రయత్నించారు.దీంతో ఆయన మద్దతుదారులు,పార్టీ కార్యకర్తలు యాదవ్ వాహనానికి అడ్డుపడ్డారు. వారిని చెదరగొట్టే క్రమంలో గంగవరం సిఐ ఉద్రిక్త పరిస్థితులలో పోలీసులు సభాస్థలి నుంచి తరలించడానికి వచ్చిన పోలీసులు, బిసివై కార్యకర్తలు మరోవైపు మొహరించడంతో వారిని చెదరగొట్టారు. అడ్డుపడుతున్న కార్యకర్తలను బలవంతంగా ఈడ్చుకుంటూ, దారుణంగా ప్రవర్తించిన పోలీసులు వైకాపా కార్యకర్తల్లా వ ్యవహరించారని, ఈసంఘటనపై తప్పక ఫిర్యాదుచేస్తానని రామచంద్రయాదవ్ వ్యవహరించారు. సభాస్థలిని, తమ సభకు చెందిన పరికరణాలను పోలీసులు ధ్వంసంచేశారని, ఈ సంఘటనకు మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

## మృతురాలి కుటుంబానికి రూ.10లక్షల తపాలా బీమా

**పుంగనూరు,జనవరి 12 ప్రభాతవార్త:**
ముందు జాగ్రత్తగా రూ.399 చెల్లించి తపాలా బీమా తీసుకున్న ఒక మహిళ కుటుంబానికి తపాలాశాఖ రూ.10లక్షల బీమా నగదు చెల్లించింది. దీంతో బాధిత కుటుంబానికి భారీ సాయం అందినట్లయింది. మండలంలోని సుగాలిమిట్టకు చెందిన ఎం. కళావతమ్మ అనే మహిళ స్థానిక తపాలాశాఖలో రూ.399చెల్లించి ప్రమాదబీమా గతంలో తీసుకుంది. ఈక్రమంలో ఆమె ఇటీవల హఠాత్తుగా మృతి చెందడంతో నెల వ్యవధిలో బీమా డబ్బులు అందాయి. జిల్లా తపాలా శాఖ ఎస్పీ లక్ష్మణ్,జనరల్‌మేనేజర్ సునీల్, మేనేజర్ నాగార్జున, ఏఎస్పీ గణపతి,స్థానిక తపాలాశాఖాధికారిణి నీలిమ,సర్పంచ్ దేవమ్మల సంయుక్త చర్యలతో ఆమె కుటుంబసభ్యులు చెక్కు అందుకుని,ఆనందం వ్యక్తం చేశారు.

## ఎంసి విజయానందరెడ్డికి వైకాపా అభ్యర్థిత్వంపై సంబరాలు

**ఎస్ఆర్‌పురం, జనవరి 12 ప్రభాతవార్త:**
చిత్తూరు వైకాపా అభ్యర్థిత్వం ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డికి ఖరారు కావడంతో శుక్రవారం మండలంలోని కొత్తపల్లిమిట్టలో ఎంసి విజయానందరెడ్డి అభిమానులు సంబరాలు చేసుకొన్నారు. చిత్తూరు-పుత్తూరు రోడ్డుపై పెద్ద ఎత్తున టపాకాయలు పేల్చి, స్థానిక వినాయక గుడిలో ఎంసి వవిజయానందరెడ్డి పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయబాబు, పార్లమెంటు పార్టీ కార్యదర్శి సూరిరెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ ఢిల్లయ్య, ఎంపిటీసీ కోటిరెడ్డి బాబు, కటికపల్లి సర్పంచ్ మార్కొండయ్య, తిప్పినాయుడుపల్లి సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్ గోవిందరెడ్డి, ఉప సర్పంచ్ సుందరమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పల్లె ప్రజల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

**ఎస్ఆర్‌పురం, జనవరి 12 ప్రభాతవార్త:**
పల్లె ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పించడానికి వికసిత్ భారత్ ఉద్దేశమని నేషనల్ బిజెపి కౌన్సిల్ సభ్యులు రాజేంద్ర అన్నారు. ఎఎంపురం పంచాయతీలో శుక్రవారం వికసిత్ భారత్ కార్యక్రమం న్విహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఎవరైనా అర్హులై వుండి ఇప్పటి వరకు మంజూరు కాకుంటే దరఖాస్తులు చేసుకోవాలని ఈ సందర్భంగా బిజెపి నాయకులు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు జ్యోతిరెడ్డి, బిజెపి నాయకులు రుక్మిణమ్మ, నాగరాజు, మండల అధికారులు పాల్గొన్నారు.

## నాటు సారా స్వాధీనం-వ్యక్తి అరెస్టు

**గుడిపాల, జనవరి 12 ప్రభాతవార్త:**
మండల పరిధిలోని చీలాపల్లి సమీపంలో ఓ వ్యక్తి నాటు సారా తరలిస్తుండటంతో అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పోలీసులకు అందిన సమాచారం మేరకు చీలాపల్లి వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తే చిత్తూరు నక్కిరపల్లికి చెందిన షూకుర్(55) వద్ద ఐదు లీటర్ల నాటు సారా పట్టుబడిందని, ఈ మేరకు అతనిని అరెస్టు చేసినట్లు తెలిపారు. షుకూర్‌ను అరెస్టు చేయడంలో ఎఎస్ఐ మునివేలు, ఐడి పార్టీ రామారావు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఇన్‌స్పెక్టర్

**పాలసముద్రం, జనవరి 12 ప్రభాతవార్త:**
పాలసముద్రం పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం కార్వేటినగరం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సత్తిబాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్‌లో వివిధ రికార్డులను పరిశీలించిన ఇన్స్‌పెక్టర్ సత్తిబాబు రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఎస్ఐ ప్రసాద్‌కు సూచించారు. ఈ సందర్భగా ఇన్స్‌పెక్టర్ సత్తిబాబు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ ఆవరణను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా వుంచాలని, న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు అండగా నిలిచి వారికి న్యాయం చేయాలన్నారు. పోలీసు విధుల్లో నిరంతరం అప్రమత్తంగా వుండి పోలీసు స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మెలగాలని సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా గట్టి గస్తీ ఏర్పాటు చేయాలని ఎస్ఐ ప్రసాద్‌ను ఇన్స్‌పెక్టర్ సత్తిబాబు కోరారు.

## పేద ప్రజలనుకు చేయూత అందించడమే ట్రస్ట్ యొక్క లక్ష్యం

**చిల్లకూరు, జనవరి 12 ప్రభాతవార్త :**
పేద ప్రజలను ఆదుకుని వారికి చేయూత అందించడమే రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ యొక్క ముఖ్య లక్ష్యమని ట్రస్ట్ అధినేత రాజనేని శ్రీనివాసులు నాయుడు తెలియజేసారు. శుక్రవారం నియోజకవర్గంలో చిల్లకూరు, వాకాడు, ఓజిలి మండలాల్లో ఉన్నటువంటి దివ్యాంగులకు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేయూత అనే కార్యక్రమం ద్వారా ట్రై సైకిళ్లు, వీల్ చైర్లను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు రాజనేని పిచ్చయ్య నాయుడు, కార్యదర్శి రాజనేని రామయ్య నాయుడు, ట్రస్ట్ సభ్యులు బాబు, భాస్కర్, ప్రజేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగవంతం

- మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్



**కుప్పం, జనవరి 12 ప్రభాతవార్త :** కుప్పం మున్సిపల్ పరిధిలోని 25 వార్డుల పరిధిలో జనరల్ ఫండ్స్‌తో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కుప్పం మున్సిపాలిటీకి కేటాయించిన నిధుల్లో ఒక్కో వార్డుకు రెండు కోట్ల మేర నిధులు కేటాయించి అవసరమైన చోట్ల రోడ్లు, డ్రైనేజీలు ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. జరిగిన పనులకు బిల్లులు సైతం సకాలంలో అందుతున్నా యన్నారు. వార్డుల్లో త్వరగా పనులు పూర్తి చేసేలా చూడాలని కౌన్సిలర్లకు సూచించారు. కాగా పాతిక వార్డుల్లో54పనులకుగానుఅంచనాలుతయారుచేసి సమావేశంలో ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్లుమునస్వామి,హఫీజ్, కమీషనర్ నరసింహ ప్రసాద్, కౌన్సిలర్లు, సలహాదారులు పాల్గొన్నారు.

## తెదేపా కార్యకర్త మృతి.. చంద్రబాబు తరపున ఆర్థికసాయం

**కుప్పంరూరల్, జనవరి 12 ప్రభాతవార్త :** మండలంలోని వానగుట్టపల్లి ఎస్సీ కాలనీకి చెందిన తెదేపా కార్యకర్త గుండప్ప మృతి చెందాడు. దీంతో అతని మృతి పట్ల తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా గుండప్ప అంత్యక్రియలను చంద్రబాబు తరపున తెదేపా నేతలు పదివేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, పార్టీ విస్తరణ కమిటీ సభ్యులు కె.కన్నన్, జిల్లా నేత రాజగోపాల్, శివకుమార్‌స్వామి, చంద్రమౌళి పాల్గొన్నారు.

## మైనార్టీల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం



**కుప్పం, జనవరి 12 ప్రభాతవార్త :** మైనార్టీల సంక్షేమం తెదేపా అధినేత చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని కుప్పం తెదేపా పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక మైనార్టీ నేతలతో కలసి మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని మైనార్టీలు ఈసారి చంద్రబాబుకు పూర్తి మద్దతు తెలిపేలా చూడాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, నేతలు అన్సర్‌బాషా, హిదయతుల్లా, గౌస్, అక్మల్, ఇంతియాజ్ పాల్గొన్నారు.అలాగే రామకుప్పంలో చంద్రబాబు సిఎం కావాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. కార్యక్రమంలో పరిశీలకుడు ఖాదర్ బాషా, నేతలు సర్దార్, అన్సర్, సలాంసాబ్, ఆదిల్ హనీఫ్, అక్బర్, నియాజ్, జలీల్‌సాబ్, నిసార్, ముజ్జు, అమానుల్లా, చాంద్‌బాషా పాల్గొన్నారు.

## మంచినీటి కోసం ఖాళీ బిందెలతో మహిళల ధర్నా

**రామకుప్పం, జనవరి 12 ప్రభాతవార్త :** మండలంలోని బందార్లపల్లి పంచాయతీ గెర్నిపల్లి గ్రామంలో మంచినీటి సమస్య తీర్చాలని మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. గ్రామంలో గత పదిహేను రోజులుగా మంచినీటికి అవస్థలు పడుతున్నామని పంట పొలాల వద్ద గలబావులు, బోర్లను ఆశ్రయించాల్సి వసో్తందని వాపోయారు. పంచాయతీ పాలకులు స్పందించి నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంగా సర్పంచ్ రాజగోపాల్ మాట్లాడుతూ బోరు మోటారు మరమ్మత్తులకు గురైందని దాన్ని బాగు చేసి నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## తెలుగుయువత అధ్వర్యంలో క్రికెట్ టోర్నీ

**రామకుప్పం, జనవరి 12 ప్రభాతవార్త :** మండలంలోని పంద్యాలమడుగులో ఈనెల 13-16 తేదీల్లో తెలుగుయువత అధ్వర ్యంలో ఎన్టీఆర్ స్మారక మెగా క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు తెలుగుయువత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం తెలిపారు. విజేతలకు రూ 50వేలు, ద్వితీయ బహుమతిగా రూ 30వేలు, మూడో బహుమతిగా 20వేలు, నాలుగో బహుమతిగా పదివేలు అందిస్తామన్నారు. ఆసక్తిగల జట్లు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

## గ్రామాలు పచ్చగా ఉండాలి...రైతు బాగుపడాలి

**పుంగనూరు, జనవరి 12, ప్రభాతవార్త:**



గ్రామసీమలు సస్యశ్యామలమై,రైతులు బాగుపడినపుడే దేశం ముందుకు వెడుతుందని పారిశ్రామికవేత్త ఎన్.వేణు గోపాల్‌రెడ్డి అన్నారు. ప్రజలతో మమేకం కార్యక్రమంలో భాగంగా మండలం లోని మీర్జేపల్లిగ్రామంలో ఆయన పర్యటించారు. ఆయనకు ప్రజలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. గ్రామంలో ప్రతివాడను ఆయన సందరి ్శంచారు. ఈసందర్భంగా ఆయనకు స్థానిక సమస్యలను ప్రజలు వివరించారు. గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామివారి ఆలయ నిర్మాణంలో సాయపడు తానన్నారు. కార్యక్రమంలో ఎన్వీఆర్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి శివకుమార్‌రెడ్డి,ట్రస్టు సభ్యులు,

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఒత్తిడులకు దూరంగా వుండాలి : డాక్టర్ ఉదయ



**చౌడేపల్లి, జనవరి 12 ప్రభాతవార్త :** ఒత్తిడులకు దూరంగా వుంటే ఎలాంటి సమస్యలుండవని ప్రముఖ నరాలు, మానసిక వైద్య నిపుణుడు ఉదయ్ కిరణ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆరోగ్యం కేంద్రంలో మానసిక ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పొగతాగడం, మద్యం సేవించడం వంటి వ్యసనాలకు దూరంగా వుండాలన్నారు. ఈ శిబిరంలో 30మంది మానసిక, నరాలకు సంబంధించిన పరీక్షలు చేయించుకొన్నారు. వైద్యాధికారులు పవన్‌కుమార్, పూజ, మాసిన్‌రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆత్మీయ పలకరింపులతో ప్రారంభమైన కెపిఎల్ టోర్నమెంట్

-సంక్రాంతి తెచ్చిన కెపిఎల్ పండుగ

**రాజులూరు(చౌడేపల్లి), జనవరి 12 ప్రభాతవార్త :** మండలంలోని ఎ.కొత్తకోట క్రాస్‌వద్ద గల నారాయణరాజు మెమోరియల్ మైదానంలో ఆత్మీయ పలకరింపుల మధ్య క్షత్రియ ప్రీమియర్ లీగ్(కెపిఎల్)క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఇదే ప్రాంతంలో జన్మించి, విద్యాభ్యాసం పూర్తి చేసుకొని కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాలకు వెళ్ళిన వారందరినీ సంక్రాంతిన కెపిఎల్ రూపంలో మైదానంలో కలిపింది. 3రోజుల పాటు జరిగే నియోజకవర్గ స్థాయి టోర్నమెంట్‌లో మొదటి బహుమతిని దివ్యశ్రీ భాస్కరరాజు, రెండు, మూడవ బహుమతులను ఎన్.పురుషోత్తమరాజు, ఎం.సుదర్శనరాజు అందిస్తారని నిర్వాహకులు తెలిపారు. నియోజకవర్గంలోని క్షత్రియ ప్రముఖులు, స్థానికులు పాల్గొన్నారు.

## జిజెఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి కానుకలు

- చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి - జిజెఎం ట్రస్ట్ అధినేత గురజాల జగన్‌మోహన్



**చిత్తూరురూరల్, జనవరి 12 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు సంక్రాంతి పండుగను తమ కుటుంబసభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని ముందస్తుగా సంక్రాంతి కానుకలను అందజేస్తున్నట్లు తెలుగుదేశం సీనియర్ నాయకులు, జిజెఎం ట్రస్ట్ అధినేత గురజాల జగన్‌మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం టిటిడి కళ్యాణమండపం నందు సంక్రాంతి కానుకలు (నెయ్యి, గోధుమ పిండి, కందిపప్పు, శనగపప్పు, బెల్లం)లను బ్యాగులలో సిద్దం చేసి వాహనాలలో సమకూర్చారు.అనంతరం సంక్రాంతి కానుకల వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు.

## ఉత్తమ సేవా పురస్కార అవార్డు అందుకొన్న జోసఫ్ రాజు



**చిత్తూరురూరల్, జనవరి 12 ప్రభాతవార్త:** స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న సపోర్టు సంస్థ అధ్యక్షులు జోసఫ్‌రాజు ఉత్తమ సేవా పురస్కార అవార్డు అందుకొన్నారు. శుక్రవారం డిఆర్‌డిఏ సమావేశం మందిరం నందు నెహ్రూ యువజన సంఘం ఆధ్వర్యంలో వివిధ స్వచ్ఛంద సంస్థలకు అవార్డులను అందజేసారు. ఈ నేపధ్యంలో జోసఫ్‌రాజు డిఆర్‌డిఏ పిడి తులసీ, నెహ్రూ యువకేంద్ర కోఆర్డినేటర్ ప్రదీప్‌కుమార్, గణాంక అధికారి బాబురెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకొన్నారు.

## చేపల పెంపకంతో మత్స్యకారుల అభివృద్ధి

**బంగారుపాళ్యం, జనవరి 12 ప్రభాతవార్త:** చేపల పెంపకం ద్వారా మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ ఛైర్మన్ ఎంబి.కుమారరాజా అన్నారు. శుక్రవారం గుంతూరు వీరప్పనాయని చెరువు నందు మత్స్యశాఖ ఉచితంగా అందించిన చేపపిల్లలను ఆయన చెరువులోకి వదిలిపెట్టారు. ఈసందర్భంగా కుమారరాజా మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాయితీతో వలలు, బోట్లు,ద్విచక్రవాహనాలు, నాలుగు చక్రాల వాహనాలు అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే చేపల దుకాణాల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో గంగపుత్ర సహకార సంఘ అధ్యక్ష, కార్యదర్శులు, నాగరాజు, ఉమాపతి, జడ్పీటీసీ సోమశేఖర్, పీల్డ్ అసిస్టెంట్ గౌరి, ఇరిగేషన్ ఏపీడీ బాటాజి కుమార్, సహకార సంఘ ఉపాధ్యక్షుడు పివి రెడ్డెప్ప, సభ్యులు చంద్రశేఖర్, కేశవులు, రఘు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## రాష్ట్రం బాగుపడాలంటే జగన్‌ను సాగనంపాలి

- మాజీ ఎంపీ చింతా మోహన్

**కోట, జనవరి 12 ప్రభాతవార్త :**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు పోవాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని మాజీ ఎంపీ డాక్టర్ చింతా మోహన్ అన్నారు. శుక్రవారం కోటలో ఇంటింటింటికి కాంగ్రెస్ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్రం బాగుపడాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని సాగనంపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరుకుంటున్నారని చెప్పారు. 2024 ఎన్నికల్లో వైసీపీకి డిపాజిట్లు కూడా రావని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి కొంతమంది పెద్ద నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వగలిగింది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు. దుగరాజపట్నం పోర్టు నిర్మాణాన్ని కాంగ్రెస్ పార్టీ మాత్రమే చేయగలదని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పంట శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గూడలిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

**కోట, జనవరి 12 ప్రభాతవార్త :**



కోట మండలం గూడలి, చెందోడు గ్రామాల్లో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కోట మండల బిజెపి అధ్యక్షుడు డాక్టర్ సారంగం రమేష్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న 17 రకాల సంక్షేమ పథకాలను వివరించారు. తొమ్మిదేళ్ల మోడీ పాలనలో దేశ వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలను ఆదుకున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు సంక్షేమ పథకాలు కేంద్రప్రభుత్వం అమలు చేస్తుంటే అవి వైసీపీ ప్రభుత్వ పథకాలని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. అంతకుముందు రైతులకు డ్రోన్లు పొలాల్లో పిచికారి చేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దాసరి అంజమ్మ, ఎంపిడిఓ భవాని తదితరులు పాల్గొన్నారు.

## అభ్యుదయ ఫౌండేషన్‌చే దుప్పట్లు పంపిణీ

**సూళ్లూరుపేట, జనవరి 12 ప్రభాతవార్త :**



సూళ్లూరుపేటలోని అభ్యుదయ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరిం చుకొని నిరుపేదలకు శుక్రవారం దుప్పట్లను పంపిణీ చేశారు. పసుపులేటి గోపాలకృష్ణ నాయుడు, ఉషా దంపతులు, వారి కుటుంబ సభ్యులు ఉదయ్‌కిరణ్, రోహిత దాతృత్వంతో ఈ పంపిణీ జరిగింది. చలికాలంలో నిరుపేదలకు దుప్పట్లు అందజేయడం తమ బాధ్యతగా భావించి ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఫౌండేషన్ సభ్యురాలు ఉషా తెలిపారు. ఈ కార్యక్రమంలో యాకసిరి నరేష్‌బాబు, కార్తీక్, భాస్కర్, అనిల్‌కుమార్, సూరా కమ్మిరెడ్డి, సుంకర ప్రతిమ, వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## చెట్లు ప్రగతికి మెట్లు : చిగురుపాటి పవన్

**వెంకటగిరిరూరల్ జనవరి 12 ప్రభాతవార్త:**



మార్పు సంస్థ 14వ వార్షికోత్సవం సంధర్భంగా పెట్లూరు గ్రామంలో మొక్కలు నాటారు.14వ వార్షికోత్సవం సంధర్భంగా మార్పు సంస్థ వ్యవస్థాపకులు చిగురుపాటి పవన్ మాట్లాడుతు ఇలాంటి ముఖ్యమైన రోజు ఆనగా వార్షికోత్సవం నాడు మొక్కలు నాటి జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.మార్పు సంస్థ ఆధ్వర్యంలో ఇంకా అనేక సేవా కార్యక్రమాలుకు శ్రీకారం చూడుతున్నట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బ్రదర్ డాక్టర్ వెందోటి బాబు, కంచి గురుప్రసాద్,మోపూరూ ఆడివయ్యా,సురేష్, వినోద్,ఈశ్వర్, గ్రామ ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం అడిగిన వెంటనే నిధులు మంజూరు చేశారు

- గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు
- నూతన కూరగాయల మార్కెట్ ప్రారంభం



**గూడూరు, జనవరి 12 ప్రభాతవార్త :**
వైసీపీ అధికారంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని, అడిగిన వెంటనే సీఎం జగన్‌మోహ న్‌రెడ్డి నిధులు కేటాయించారని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు తెలిపారు. గూడూరు పట్టణంలోని ఐసిఎస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్‌ను ఎమ్మెల్యే వరప్రసాదరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, ఎంఎల్‌సీలు మేరిగ మురళీధర్, బల్లి కల్యాణ చక్రవర్తిలు ప్రారంభించారు. వారికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాదరావు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వ్యక్తి మేరిగ మురళి అని పేర్కొన్నారు. పట్టణంలో మార్కెట్లు, రైతుబజారు, హైవే వంతెన వంటి అభివృద్ధి పనులు వైసీపీ ప్రభుత్వంలో చేపట్టామని తెలిపారు. రూ.80 లక్షల వ్యయంతో చేపల మార్కెట్ పనులు కూడా మొదలయ్యాయని తెలిపారు. ఎంఎల్‌సి మేరిగ మురళీధర్ మాట్లాడుతూ చిరకాల కోరిక మార్కెట్ నిర్మాణం పూర్తయిందని, అలాగే వంతెన పనులు కూడా 1, 2వ పట్టణ ప్రాంత ప్రజలకు ఎంతో అవసరమన్నారు. ఆ పనులు కూడా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ దేవసేనమ్మ మాట్లాడుతూ పట్టువదలని విక్రమార్కుడిలా ఎమ్మెల్యే వరప్రసాదరావు అభివృద్ధి పనులు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు బొమిడి శ్రీనివాసులు, మురళి, కోదండరామయ్య, ఎంపిసి ఛైర్మన్ యమునమ్మ, యోగి తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాడు రేషన్ బియ్యం పట్టివేత!

**దొరవారిసత్రం, జనవరి 12 ప్రభాతవార్త :**



దొరవారిసత్రం మండల పరిధిలోని తల్లంపాడు గ్రామ సమీపంలో అక్రమంగా తరలి వెళుతున్న రేషన్ బియ్యం, మినీ వ్యాన్‌ను విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. మినీ వ్యానులో తరలుతున్న రేషన్ బియ్యానికి ఎలాంటి అనుమతులు లేవు. బస్తాల్లో ఉన్న 25 50 కేజీల తమిళనాడు రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అనంతరం వాహనాన్ని సీజ్ చేసి స్థానిక పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. పట్టుబడిన వాహనంలో ఉన్న బియ్యాన్ని సూళ్లూరుపేట ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు అందజేసినట్లు అధికారులు తెలిపారు.

## ఎంఎల్‌సి మురళిని కలిసిన సీఐ హజరత్‌బాబు

**గూడూరు, జనవరి 12 ప్రభాతవార్త :**



ఎంఎల్‌సి మేరిగ మురళీధర్‌ను గూడూరు వన్‌టౌన్ సీఐ జి.హజరత్‌బాబు శుక్రవారం మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. మేరిగ మురళీధర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

## రానున్న ఎన్నికల్లో మేరిగ మురళిని గెలిపించుకుంటాం

**గూడూరు, జనవరి 12 ప్రభాతవార్త :**



గూడూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన ఎంఎల్‌సి మేరిగ మురళీధర్‌ను రానున్న ఎన్నికల్లో గెలిపించుకుంటామని జగనన్న సేవాసమితి ఫౌండర్, వైసీపీ సీనియర్ నాయకులు ఊటుకూరు మహేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మేరిగ మురళీధర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన నివాసంలో కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట నన్నూరు రాజశేఖర్, ముప్పాళ్ల పెంచలరాజు, సుబ్బనాయుడు, రాజేష్, బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి, కోటేశ్వరరావు, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో 428వ నేత్రదానం

**సూళ్లూరుపేట, జనవరి 12 ప్రభాతవార్త :**
సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థకు శుక్రవారం 428వ నేత్రదానం అందింది. పట్టణంలోని సాయినగర్ వాస్తవ్యులు మహంకాళి నీలమ్మ మృతిచెందడంతో కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమె కార్నియాలను సేకరించి చెన్నైలోని శంకర్ నేత్రాలయకు పంపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమ సిఎం జగన్మోహన్ రెడ్డి లక్ష్యం

**వెంకటగిరి, జనవరి 12 ప్రభాతవార్త :**
పేదల సంక్షేమమే సిఎం జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణం 13 వార్డు శివాలయం వీధి పోలీసు క్వార్టర్స్‌లో మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. పేదలు ఆనందంగా జీవించాలని నవరత్నాలు పథకాలను సిఎం అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రానికి మరల జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేసారు. ప్రతిపక్షాలు వారు ఎంత మంది కలిసిన సిఎం జగన్మోహన్ రెడ్డిని ఏమి చేయలేరని తెలిపారు. అడక్కుండానే వరాలు ఇచ్చే దేవుడు సిఎం జగన్మోహన్‌రెడ్డి అని తెలిపారు.

## వైఎస్ఆర్ జలకళ పథకం రైతులకు వరం:ఎంపిపి

**బాలాయపల్లి, జనవరి 12 ప్రభాతవార్త :**
వైఎస్ఆర్ జలకళ ప్రోగ్రాంలో భాగంగా మొదటి విడత 14 మంది లబ్ధిదారులకు 14.10 లక్షల రూపాయిలు విలువ కలిగిన మోటార్ పంపులను ఎంపిపి గూడూరు భాస్కర్‌రెడ్డి పంపిణీ చేసారు. రైతుల అభ్యున్నతికి సిఎం జగన్మోహన్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. వైఎస్ఆర్ జలకళ రైతులకు వరం లాంటిది అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ప్రమీల రాణి, ఏపివో మృత్యుంజయరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## 32 రోజులు చేరిన అంగన్‌వాడి సిబ్బంది సమ్మె

**వెంకటగిరి, జనవరి 12, ప్రభాతవార్త :**
డిమాండ్ల సాధనకు అంగన్‌వాడి సిబ్బంది చేస్తున్న సమ్మె శుక్రవారం నాటికి 32 రోజులు చేరింది. సిడిపిఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడి సిబ్బంది రిలే నిరాహార దీక్ష ద్వారా నిరసన తెలిపారు. డిమాండ్ పరిష్కరించే వరకు పోరాటం ఆగదని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డేపల్లి చంగయ్య హెచ్చరించారు. 32 రోజుల నుంచి అంగన్‌వాడి సిబ్బంది సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడి సిబ్బంది డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.

## నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపిన వెలుగు సిబ్బంది

**బాలాయపల్లి, జనవరి 12 ప్రభాతవార్త :**
డిమాండ్ల సాధనకు వెలుగు కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్‌లతో సిబ్బంది నిరసన తెలిపారు. ఎన్నికల ముందు పర్మినెంట్ చేస్తామని సిఎం ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని ఏపిఎం శ్రీనివాసులు కోరారు. ఈ నెల 22వ తేది వరకు నిరసన కార్యక్రమాలు జరుగు తాయని సిసిలు సురేఖ, ఇందిర తెలిపారు.

### ఈవిఎం పనితీరును పరిశీలించిన రామ్‌కుమార్ రెడ్డి

**వెంకటగిరి, జనవరి 12 ప్రభాతవార్త :**
ఈవిఎంల పనితీరును వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈవిఎంల అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయన ఓటింగ్ యంత్రాలు పనిచేయడం పరిశీలించారు.


Form No.3
**BEFORE THE HON'BLE DEBT RECOVERY TRIBUNAL - II**
**III FLOOR, TRIVENI COMPLEX (PALACE HEIGHTS), ABIDS AT HYDERABAD**
**O.A.No. 571 of 2021**
**Summons under sub-section (4) of section 19 of the Act read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993**
BETWEEN:
**M/s Sapthagiri Grameena Bank, PUNGANUR Branch** ...Applicant
AND
1. **Mr. Krishnaiah Chetty** son of R. Rayal Setty, Occupation: Business resident of Bazar Street, PALAMENURU Village and Handal, Chittoor District, Andhra Pradesh
2. **M/S. Sri Balaji Cold Storage** represented by Mr. R.Rayal Kumar son of R.Krishnaiah Chetty, PUNGANUR-517247, Chittoor District. Andhra Pradesh.
3. **M/S. Sri Dwaraka Rural Godown** (ware house) represented by Mrs. R.Deepa, PUNGANUR-517247, Chittoor District. Andhra Pradesh.
...Defendants
**SUBSTITUTE SERVICE BY WAY OF PAPER PUBLICATION**
Whereas O.A.No. 571 of 2021 was listed before Honourable Presiding Officer on 29.12.2023. Whereas this Honourable Tribunal was pleased to issue summons/notice on the said application under section 19 (4) of Act, (OA) filed against you for recovery of debts of **Rs.40,21,679/-** (Rupees Forty Lakhs Twenty One Thousand and Six Hundred Seventy Nine only) In accordance with sub-section (4) of Section 19 of the Act, You the defendants are directed as under
I) To show cause within 30 days of the service of summons as to why relief prayed for should not be granted. II) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial No.3(A) of the original application. III) You are retained from delaying with dispossessing of secured assets or such other properties disclosed under serial No.3(A) of the original application, pending disposal of the application for attachment of properties. IV) You shall not transfer by way of sale, lease or otherwise except In the ordinary course of his business any of the assets over which security interest is created and or other assets and properties, specified in serial number 3A of the original application without prior approval of the tribunal. V) You shall liable account for the sale of proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary couse or binding and deposits such sale proceeds in the account maintained with bank or financial institutions holding security interested, over such assets. You are directed to file written statement with a copy thereof furnished to the applicant and to appear before Register on 04.03.2024at 11 am failing which the application shall be heard and decided in your absence.
*Given under my hand and the seal of this Tribunal on this date:* ***09.01.2024***
**Signature of the Authorized Officer to issue Summons**

Form No.3
**BEFORE THE HON'BLE DEBT RECOVERY TRIBUNAL - II**
**III FLOOR, TRIVENI COMPLEX (PALACE HEIGHTS), ABIDS AT HYDERABAD**
**O.A.No. 751 of 2021**
**Summons under sub-section (4) of section 19 of the Act read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993**
BETWEEN:
**Sapthagiri Grameena Bank,** represented by its Chairman & Authorized Officer, Punganur Branch, PUNGANUR-517247, Chittoor District, Andhra Pradesh. ...Applicant
AND
1) **Mr. K. Manohar** son of Venkataswamy, resident of Matam Street, PUNGANUR-517247, Chittoor District, Andhra Pradesh.
2) **M/s. Sri Dwarkamal Rural Godowns** represented by Mrs. R. Deepa wife of R. Rayal Kumar, PUNGANUR-517247, Chittoor District, Andhra Pradesh.
3) **M/S. Sri Balaji Cold Storage** represented by Mr. R.Rayal Kumar son of R.Krishnaiah Chetty, PUNGANUR-517247, Chittoor District. Andhra Pradesh.
4) **Mr. R. RAYAL KUMAR** son of R. Krishnaiah Chetty, PUNGANUR- 517247, Chittoor District, Andhra Pradesh. ...Defendants
**SUBSTITUTE SERVICE BY WAY OF PAPER PUBLICATION**
Whereas O.A.No. 751 of 2022 was listed before Honourable Presiding Officer on 10.01.2024. Whereas this Honourable Tribunal was pleased to issue summons/notice on the said application under section 19 (4) of Act, (OA) filed against you for recovery of debts of **Rs.92,36,448/-** (Rupees Ninety Two Lakhs Thirty Six Thousand Four Hundred and Forty Eighty only) In accordance with sub-section (4) of Section 19 of the Act, You the defendants are directed as under
I) To show cause within 30 days of the service of summons as to why relief prayed for should not be granted. II) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial No.3(A) of the original application. III) You are retained from delaying with dispossessing of secured assets or such other properties disclosed under serial No.3(A) of the original application, pending disposal of the application for attachment of properties. IV) You shall not transfer by way of sale, lease or otherwise except In the ordinary course of his business any of the assets over which security interest is created and or other assets and properties, specified in serial number 3A of the original application without prior approval of the tribunal. V) You shall liable account for the sale of proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary couse or binding and deposits such sale proceeds in the account maintained with bank or financial institutions holding security interested, over such assets. You are directed to file written statement with a copy thereof furnished to the applicant and to appear before Register on 18.03.2024 at 11 am failing which the application shall be heard and decided in your absence.
*Given under my hand and the seal of this Tribunal on this date:* ***09.01.2024***
**Signature of the Authorized Officer to issue Summons**

## కుల గణన బాధ్యతలను ఉపాధ్యాయులకు అప్పగించాలి!



**శ్రీకాళహస్తి,జనవరి 12 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తిలో కులగణన బాధ్యతలను ప్రభుత్వాలు ఉపాధ్యా యులకు అప్పగించి పారదర్శకంగా నిర్వహించాలని శుక్రవారం జరిగిన వివిధ కులాల ప్రతినిధులతో జరిపిన సమావేశంలో అభిప్రయాలను వ్యక్తం చేసారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాలతో మేనేజర్ ఉమామహేశ్వరరావు, టిపిఒ మధుసూధన్‌ల అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి ఇంటింటికి వాలంటీర్లు వస్తారని సహాకరించాలని కోరారు. వాలంటీర్లు ఇంటింటికి వచ్చి ఇంటియజమాని పేరు ఇంటిలో సభ్యుల సంఖ్య, వారి స్థితి గతులు గురించి వాకబు చేస్తారన్నారు. వారు వచ్చినపుడు సమాచారం ఇవ్వాలన్నారు. మీరు ఏ సమాచారం అందిస్తే దానిని నమోదు చేస్తారని తరువాత సచివాలయసిబ్బంది పర్యవేక్షిస్తారని చేతి ముద్రలు వేయాలని అప్పుడే నమోదు అవుతుందన్నారు. కాగా 2021లో జనగణన చేయాలిల్స ఉందని కానీ కరోనా కారణంగా అమలు జరగలేదన్నారు. ఈ సమావేశంలో మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ వయ్యాల కృష్ణారెడ్డి, బలిజ కులానికి సంబంధించి పోలసామి స్వర్ణమూర్తి, చందమామల కోటయ్య, మాజీ కౌన్సిలర్ నాగరాజు, మైనారిటి ముస్లింల తరపున హాఫీజే ఖుర్ అన్ రేహాన్‌సాహెబ్, మహామూద్, మున్సిపల్‌అధికారులుసీనియర్ అసిస్టెంట్ ప్రేమ్ కుమార్, డిపిఒ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇస్లాం మతం పరోపకారం నేర్పుతుంది! : రేహాన్

**శ్రీకాళహస్తి, జనవరి 12 ప్రభాతవార్త :**

ఇస్లాం మతం పరోపకారం నేర్పుతుందన్నారు. మనిషి తతన జీవిత రహస్యాన్ని తెలుసుకొని స్వర్గం ప్రాప్తి కోసం అలాల్లహ్‌ను ప్రార్థించాలని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల తరువాత ఆయన మాట్లాడుతూ మనం ఇహలోకంలో అతిథులమన్నారు. మనం ఇక్కడ అల్లాహ్‌కు నచ్చేరీతిలో నడచుకోవాలన్నారు. కానీ మనం అలా చేయక మనకు ఇష్టమొచ్చిన రీతిలో వ్యవహారిస్తున్నామన్నారు. మన పూర్వీకులు అల్లాహ్ కు నచ్చే విధంగా నడచుకుంటూ స్వర్గస్తులయ్యారన్నారు. మనం ఎల్లపుడు సమా జంలో ఇరుగుపొరుగు కష్టాల్లో పాలుపంచుకోవాలన్నారు. మనం ఎంత సంపాదించినా తోడు తీసుకొని వెళ్ళమని ఈ విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు. నేడు మన సంతతి తల్లి దండ్రులను విస్మరిస్తున్నారన్నారు. మన ప్రవర్తనలో మార్పు రావాలని పిలుపు నిచ్చారు.

## ఆవుదూడ బహూకరణ



**శ్రీకాళహస్తి, జనవరి 12 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న అర్ధనారీశ్వరాయానికి శుక్రవారం ఆలయ ఉద్యోగి ఆవుదూడను బహూకరించారు. ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మల్లికార్జున్ ప్రసాద్ కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తరువాత చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులుతో తాము ఆవుదూడను బహూకరించనున్నట్లు వివరించారు. ఇక్కడ భక్తుల సదుపాయానికి ఆలయం తరపున షెడ్డును ఏర్పాటు చేయాలని కోరారు. దాంతో చైర్మెన్ వెంటనే ఇంజనీరింగ్ విభాగానికి ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ఇఇ నూకారత్నం, ఎఇఇ వేణుగోపాల్, పవన్ కుమార్, వర్క్ ఇన్స్‌పెక్టర్ ప్రతాప్, సూర్యప్రసాద్, బాలాజీ, స్థపతి కుమార్ తదితరులు ఎపాల్గొన్నారు.

## ఉత్సాహంగా వాక్ విత్ బొజ్జల కార్యక్రమం



**తొట్టంబేడు, జనవరి 12 ప్రభాతవార్త :** జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వాక్ విత్‌బొజ్జల కార్యక్రమాన్ని నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, బొజ్జల రిషితారెడ్డిలు చేపట్టారు. ఈపాదయాత్ర బిపి అగ్రహారం నుంచి పెండ్లిమండపం, బేరివారి మండపం మీదుగా శ్రీకాళహస్తి దేవస్థానం వరకు సాగిన పాదయాత్రకు విశేష స్పందన లభించింది. బిక్షాలగోపురం వద్ద ఉన్న మహాత్ముని విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం చేసిన మోసాన్ని ప్రజలకు తెలపడం కోసం పాదయాత్రను చేపట్టామన్నారు. నియోజకవర్గంలో పరిశ్రమలను తీసుకువచ్చిన ఘనత బొజ్జలగోపాలకృష్ణారెడ్డిదే అని నియోజకవర్గంలో బొజ్జలపాలన రావాలని అందుకు ప్రజలందరు ఆశీర్వదించాలని కోరారు. అనంతరం చీపుర్లుచేపట్టుకుని వీధులను శుభ్రం చేశారు. యువత అందరు స్వామి వివేకానంద అడుగుజాడల్లో నడవాలన్నారు. యువతా మేలుకో.. రాష్ట్రాన్ని కాపాడుకో అన్న నినాదాలు ఇస్తూ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో కోడూరుబాలసుబ్రమణ్యం, రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి, రాష్ట్ర యువత రవినాయుడు, విజయకుమార్, చెంచయ్య నాయుడు, బత్తిరెడ్డి, కాసరం రమేష్, కృష్ణయాదవ్, కిట్టు, హేమంత్, పవన్, ప్రతాప్, వినయ్, సన్నీ, రామకృష్ణ, లక్ష్మణ పాల్గొన్నా రు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం



**శ్రీకాళహస్తి, జనవరి 12 ప్రభాతవార్త :** పట్టణంలోని యువతరం సేవాసమితి ఆధ్వర్యం లో 161వ జయంతిని పురస్కరిం చుకుని జాతీ య యువజన దినోత్సవనాణ్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి విచ్చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేశారు. స్వచ్ఛందంగా రక్తం ఇచ్చిన యువతకు ఆర్డీవో చేతులమీదుగా ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమాల్లో కిషోర్, యువతరం సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

## ఒంటికాలిపై నిలబడి అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన



**తొట్టంబేడు, జనవరి 12 ప్రభాతవార్త :** తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మె నేటికి 32వ రోజుకు చేరుకోవడంతో పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సమ్మె నిర్వహిస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగస్తులు, నేడు ధర్మం ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగస్తులు మాట్లాడుతూ నేడు ధర్మం ఒంటికాలిపై నడుస్తోందని తాము ధర్మంగా అడుగుతున్న సమస్యలను సిఎం పరిష్కరించడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఐసిడిఎస్ ప్రాజెక్టు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొడుదాం!



**శ్రీకాళహస్తి, జనవరి 12 ప్రభాతవార్త :** ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టి స్వచ్ఛ శ్రీకాళహస్తిగా మారు స్తామని బొజ్జల బృందమ్మ, బొజ్జల రిషితారెడ్డిలు పిలుపు నిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో గాండ్ల తెలికుల బిసి సాధికార సమితి రాష్ట్ర సభ్యులు కన్నావరం హరిబాబు పర్యవేక్షణలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రత్యేకంగా రూపొందించిన గుడ్డసంచులను ఆవిష్కరించి ప్రజలకు అందించారు. కార్యక్రమంలో పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

**శ్రీకాళహస్తి, జనవరి 12 ప్రభాతవార్త :**



పట్టణంలోని ముత్యాలమ్మగుడివీధిలో ఉన్న ఆక్స్ ఫర్డ్ పబ్లిక్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల చిన్నారులందరు సంప్రదాయ దుస్తులు ధరించి ఆటపాటలతో అలరించారు. చిన్నారులపై ఉపాధ్యాయులు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. అనంతరం భోగిమంటలను వేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూధన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ అనిల్‌కుమార్, పాఠశాల ఇన్‌ఛార్జి సత్యవతి, ప్రశాంతి మరియు ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

## సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో వివేకానంద జయంతి

**శ్రీకాళహస్తి, జనవరి 12 ప్రభాతవార్త**



: సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పట్టణంలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ఉన్న స్వామి వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు పసలవీరాస్వామి, ఉపాధ్యక్షులు పిళ్ళారిబత్తినయ్య, అంజూరు బాల సుబ్రమణ్యం, సురేష్, మంగిరెడ్డి, హిమవతి, ఈశ్వరయ్య, డివివి. శ్రీనివాస్, శంకరయ్య, గరికపాటి రమేష్‌బాబు, చిలకారంగయ్య, మహేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

## పట్టు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



**రేణిగుంట, జనవరి 12 ప్రభాతవార్త:** రేణిగుంట మండలం కరకంబాడి రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రకృతి వ్యవసాయంపై పట్టు రైతులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త హెడ్ డా. శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మల్బరి పంట సాగు చేస్తున్న రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంభించడం ద్వారా తక్కువ ఖర్చుతో సాగు చేసుకోవడం వీలవుతుందని తద్వారా భూమిని సారవంతంగా మారి నాణ్యమైన మల్బరి ఆకు దిగుబడి పొందవచ్చని తెలిపారు. రాస్ కేవీకే శాస్త్రవేత్తలు డా. శ్రీనివాసులు, ఏ.పద్మజ, డా. దివ్య, సుధాకర్, రామకుమార్, పిచ్చాటూరు, వెదురుకుప్పం, పుత్తూరు, నారాయణవనం, కేవీబీ పురం, రేణిగుంట మండలాలకు చెందిన పట్టు రైతులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలుపర్చాలి

– రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ డిమాండ్



**రేణిగుంట, జనవరి 12 ప్రభాతవార్త:** రైల్వేశాఖ తక్షణం కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు పరచి పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. రేణిగుంట పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద రైల్వే ఉద్యోగులకు మద్దతుగా పాత పెన్షన్ విధానాన్ని అమలుపరచాలంటూ రైల్వే విశ్రాంత ఉద్యోగులు ధర్నా చేశారు. కొత్త పెన్షన్ విధానం కార్మికుల నడ్డి విరుస్తోందని వెంటనే రైల్వేశాఖ స్పందించి కొత్త పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ అసన్, కార్యదర్శి గుమ్మడి జయంతకుమార్, ఉపాధ్యక్షులు రాజేంద్రన్, అప్పరెడ్డి, జ్ఞానశేఖర్, రవీంద్రబాబు, షణ్ముగం, వెంకటేశ్వరులు, రామమూర్తి, ఈశ్వరయ్య, భాగ్యరాజ్, జయశీలన్, రవీంద్రన్, మునయ్య, కాసిం తదితరులు పాల్గొన్నారు.

## తప్పులు చేయకండి... సరిదిద్దుకోండి..!

బిఎల్‌ఓలకు, తహశీల్దార్లకు పులివర్తి నాని మనవి



చంద్రగిరి, జనవరి 12 ప్రభాతవార్త: చంద్రగిరి నియోజకవర్గంలో ఫారమ్ -6, ఫారమ్-8 విషయంలో బూత్‌లెవెల్ ఆఫీసర్లు, తహశీల్దార్లు తప్పులు చేయ వద్దనీ, చేసిన తప్పులను సరిదిద్దుకోవాలని టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని కోరారు. శుక్రవార ఆయన గడచిన 6 నెలలుగా దొంగ ఓట్లు, బోగస్ ఓట్ల ఏరివేతపై టిడిపి అలుపెరగని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఆ మేరకు జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, ఈఆర్ఓలకు ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. ఇదే అంశాన్ని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమీషన్ దృష్టికి తీసుకెళ్ళామన్నారు. జనవరి 17న వెరిఫికేషన్, 22న తుది జాబితా విడుదల అవుతుందన్నారు. ఇది మనందరి భవిష్యత్తుకు సంబంధించినదనీ, ఎవరికోసమో ప్రాకులాడవద్దని మనవి చేశారు.

## కంటి చూపుకు మంత్రి భరోసా

**నగరి, జనవరి 12 ప్రభాతవార్త:**



కంటి సమస్యలు ఉన్న వారికి ఉచిత చికిత్స అందించడానికి కంటి పొరలున్న వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించడానికి మంత్రి రోజా తన చారిటబుల్ ట్రస్టు ద్వారా శంకర నేత్రాలయ సహకారంతో 8 రోజుల పాటు నగరిలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన ఈ శిబిరానికి 8 రోజుల్లో 720 మంది పేషెంట్లు చికిత్స నిమిత్తం విచ్చేశారు. 93 రకాల కంటికి సంబంధిత వ్యాధులను పరిశీలించిన వైద్యులు వీరిలో 137 మందికి స్థానికంగానే నొప్పి లేకుండా, కుట్లు లేకుండా అత్యాధునిక పద్ధతిలో ఆపరేషన్ చేసి రెండు గంటల వ్యవధిలో వారిని ఇంటికి పంపించేశారు. 8 రోజుల పాటు సేవలు అందించిన శంకర నేత్రాలయ ప్రతినిధి అరుళ్‌కుమార్‌ను మున్సిపల్ చైర్మన్, ఎంపీపీ శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, కౌన్సిలర్ బాడీ భాస్కర్, ఆస్పత్రి కమిటీ డైరెక్టర్ కృష్ణమూర్తి, ఎంపీటీసీ ఏసు, నాయకులు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం ఎంతో గొప్పది

– శిబిరాన్ని పరిశీలించిన డీఐవో, ఆర్డీవో



నగరి, జనవరి 12 ప్రభాతవార్త: రక్తదానం ఎంతో గొప్పదని జిల్లా టీకా అధికారి డా. రవిరాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో సామాజిక సంకల్పం పేరిట నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో నగరి, కుప్పం, పలమనేరులో శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. రక్తదానం చాలా గొప్పదన్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారితో పాటు డెంగ్యూ జ్వరంతో ప్లేట్‌లెట్స్ పడిపోయిన వారికి కూడా రక్తం అవసరమవుతుందన్నారు. ఆర్డీవో సృజన మాట్లాడుతూ మనం ఇచ్చే రక్తం ఒక మనిషి ప్రాణాన్ని కాపాడుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మంజుల, ఆర్ఐ మేఘవర్ణం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జగనన్నకు కృతజ్ఞతలు : ఎమ్మెల్యే

**పిచ్చాటూరు, జనవరి 12 ప్రభాతవార్త:**



తిరుపతి పార్లమెంట్ వైసీపీ పార్టీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి ఈ మేరకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువై ఉన్న తిరుపతి పార్లమెంట్ స్థానంలో తనకు అవకాశం కలగడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆదిమూలం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువై ఉన్న తిరుపతి పార్లమెంట్ స్థానంలో తనకు అవకాశం కలగడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. అలాగే సత్యవేడు నియోజకవర్గంలో పరిష్కారం కాని నాగలాపురం మండలం పుట్టూరు మండలంలోని టీపీ కోట రోడ్డు, కేవీబీ పురం మండలంలోని పూడి కాజ్‌వే సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్పందించిన ఆయన ఈ రెండు పనులకు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని పక్కనే ఉన్న ప్రభుత్వ సలహ్ దారు ధనంజయరెడ్డికి సూచించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

## హిందు మతగోప్పతనం చాటిన...మహనీయుడు వివేకానంద

–రంగస్థలి పుష్పాంజలి



తిరుపతి, జనవరి 12ప్రభాతవార్త: హిందు మతవ్యాప్తికోసం రామకృష్ణమఠం స్థాపించి ,హిందుమత వ్యాప్తికి స్వామివివేకానంద చేసిన కృషి శ్లాఘనీయమని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి కొనియాడారు. అమెరికాలోని చికాగోలో జరిగిన సర్వమత సమ్మేళానినికి హాజరైన వివేకానంద భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచదేశాలకు వెలుగెత్తి చాటారన్నారు. వేదాంత యోగతత్వశాస్త్రాలలో సమాజంపై అత్యంత ప్రభావం చూపిన మహనీయుడు స్వామివివేకానంద అని పేర్కొన్నారు. వివేకానందజయంతి పురస్కరించుకుని శుక్రవారం ఎస్వీవైద్యకళాశాల కూడలిలోని వివేకానంద విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పాటిబండ మురళి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, అక్కినపల్లి మునికృష్ణయ్యయాదవ్, భాస్కర్, కెఎన్ రాజ, విద్వాన్, కస్పాపద్మనాభం, సుబ్రమణ్యంయాదవ్, రితిక్, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మసముద్రం రైల్వేస్టేషన్ యాక్సెస్ ఆమోదించండి

–రైల్వే డిఎంకు బిజెపి వినతి



**తిరుపతి, జనవరి 12ప్రభాతవార్త:** బొమ్మసముద్రం రైల్వేస్టేషన్ యాక్సెస్ ఏర్పాటుచేయాలని, ప్రయాణీకులు సులభంగా స్టేషన్‌లోకి ప్రవేశించడానికి మార్గం సుగమం చేయాలని దక్షిణమధ్యరైల్వే రైల్వే డిఎంకు బిజెపి నేతలు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తిరుపతికి వచ్చిన ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ రైల్వేయాక్సెస్‌కు అవసరమైన మార్పులు చేసి. ప్రయాణీకులు రైల్వేస్టేషన్ వైపు నడిచివెళ్ళేందుకు వీలయ్యేలా చూడాలని బిజెపి నేతలు గుండాల గోపీనాథరెడ్డి, సుబ్రమణ్యంయాదవ్, సుబ్రమణ్యంరెడ్డి, మునికృష్ణయ్య వినతిపత్రం అందజేశారు.

## అభయవెంకటేశ్వరునికి పట్టువస్త్రాలు సమర్పణ



**శ్రీకాళహస్తిరూరల్, జనవరి 12 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు నూతన పట్టు వస్త్రాలను అందించారు. శుక్రవారం తొండమాన్‌పురం లో వెలసిన భూదేవి, శ్రీదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామికి భక్తుల నుంచి విశేషంగా కానుకలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో తొట్టంబేడు మండలం పెద్దకన్నలికి చెందిన కన్నలి విజయభాస్కర్‌రెడ్డి, మల్లిక లు విలువైన పట్టు వస్త్రాలను బహూకరించారు. ఆనందస్వామి, జీవా స్వామిలకు అందజేసారు. వారు స్వామి అమ్మవార్లకు అలంకరించారు. ఈ కార్యక్రమాల్లో శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలి రైతుల డిమాండ్

**నింద్ర, జనవరి 12 ప్రభాతవార్త :**

మండలంలోని పాదిరి గ్రామలెక్కదాఖల సర్వేనెంబరు 106లో యన్‌హెచ్ హైరోడ్డు రైతులకు తమ పొలాలకు వెళ్ళడానికి జాతీయ రహదారి యాజమాన్యం సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని పాదిరి గ్రామ రైతులు డిమాండ్ చేసారు. రైతులు మాట్లాడుతూ జాతీయ రహదారి యాజమాన్యం రెండు సంవత్సరాలు క్రితం రైతుల నుంచి జాతీయ రోడ్డు నిర్మాణం చేయడానికి పొలాలు కావాలని అడిగినప్పుడు రైతులు తమ పొలాలకు వెళ్ళడానికి సర్వీసురోడ్డు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేయగా అందుకు జాతీయ రహదారి యాజమాన్యం అందుకు అంగీకరించినారని తెలపగా వారు చెప్పిన మాటలు నమ్మినాము అన్నారు. యన్‌హెచ్ 716 చిత్తూరు తచ్చూరు హైవే రోడ్డు ప్రస్తుతం జరుగుతున్న సమయంలో జాతీయ రహదారి యాజమాన్యంను సర్వీసురోడ్డు ఏర్పాటు చేయాలని రెండు సంవత్సరాలుగా తహశీల్దారు, ఆర్డీఓ, కలెక్టర్‌లకు వినతిపత్రం అందజేసిన అదికారుల చుట్టు తిరిగిన రైతులకు ఏలాంటి భరోసా లబించడం లేదు. ఈకార్యక్రమంలో రైతులు జనార్ధన్‌నాయుడు, రవి, పురుషోత్తంనాయుడు, లక్ష్మికాంతం, మునెమ్మ, పళని, సుబ్రమణ్యం, మునివేలు, రాజగోపాల్, పడివేటయ్యలు పాల్గొన్నారు.

## గర్వించేలా సువర్ణ పథకాలు సాధించిన ఆంధ్ర టీం



**తిరుపతి (క్రీడా), జనవరి 12 ప్రభాతవార్త :** మూడవ సబ్ జూనియర్, సీనియర్ నేషనల్ కర్లింగ్ ఛాంపియన్ షిప్ 2023 - 2024 పాల్గొన్న ఆంధ్ర టీం గర్వించేలా ఆంధ్రా టీం సువర్ణ పథకాలు సాధించింది. హిమాచల్ ప్రదేశ్‌లోని గల్మార్గ్ పట్టణంలో జరిగిన నేషనల్ కార్లింగ్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొన ఆంధ్రస్టేట్ కర్లింగ్ ఫెడరేషన్ సంబంధించిన రాష్ట్ర క్రీడాకారులుకు ఆరు సువర్ణ పథకాలు, నాలుగు రజిత పథకాలు ఆరు కాంస్య పతకాలు, ఓవరాల్ ఏపీ స్టేట్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న చిన్నారులు, కోచ్ శంకర్‌కి డిఎస్ఎ శాప్ ఇంచార్జి సయ్యద్, టీం ఇంచార్జ్ సురేందర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేందర్ రెడ్డి, బ్రహ్మయ్య, మునిశంకర్, టీం కోచ్ ఇంచార్జ్, క్రీడాకారులు చందన, పూజిత, హేమంత్ దీక్షిత, ఫాతిమా, సతీష్ పాల్గొన్నారు.

## రిమ్స్‌లో ముందుగానే సంక్రాంతి సంబరాలు



**తిరుపతి క్రీడా, జనవరి 12 ప్రభాతవార్త :** స్థానిక కొండారెడ్డి రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ సైన్స్ (రిమ్స్)లో సంక్రాంతి సంబరాలను కళాశాల డైరెటర్లు ఆనంద్‌రెడ్డి, విజయ్‌రెడ్డి సంప్రదాయ పద్దతులతో ప్రారంభిం చారు. వై. ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ నేటి విద్యార్థులు మన సంప్రదాయాలని గౌరవించి పాటించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. రిమ్స్ ప్రిన్సిపల్ ప్రకాష్ రెడ్డి, ఎంబిఏ, ఎంసిఏ హెచ్‌ఓడిలు పి. నిరంజన్ రెడ్డి, పి. మధురవిద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నెహ్రూ యువజన కేంద్రంచే నేషనల్ యూత్ డే సెలబ్రేషన్స్

–యువతకు స్ఫూర్తి దాయకం స్వామి వివేకానంద

–మాస్ అధ్యక్షుడు కంసాని జ్ఞానశేఖర్‌రెడ్డి



**తిరుపతిరూరల్, జనవరి 12 ప్రభాతవార్త:** భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను విదేశీయులకు తెలియజేసిన ఘనత స్వామి వివేకానందుడుకే దక్కుతుందని మహర్షి అభ్యుదయ సేవా సంస్థ అధ్యక్షుడు కంసాని జ్ఞానశేఖర్‌రెడ్డి తెలిపారు. నేటి యువతకు స్వామి వివేకానంద స్ఫూర్తి దాయకమని పేర్కొన్నారు. శుక్రవారం వివేకానంద జయంతిని పురస్కరించుకుని నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో మాస్ సంస్థ నేషనల్ యూత్ డే సెలబ్రేషన్స్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఉపాధి శిక్షణాధికారి రమణ మాట్లాడుతూ ప్రతి ఏడాది స్వామి వివేకానంద జయంతిని నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. యూత్‌కు ఐకాన్‌గా పిలవబడే వివేకానందుడి జయంతిని యువ దినోత్సవంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అవిలాల గ్రామ సర్పంచ్ రమణ, లింగేశ్వర్‌నగర్ సర్పంచ్ కోటేశ్వరరావు, వైకాపా నాయకులు గంగిరెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మేడమ్... పింఛన్ ఇప్పిస్తేనే ఓటు వేస్తా....

– ఆత్మీయ పలకరింపులో వృద్ధ మహిళలు ఆవేదన



తిరుపతిరూరల్, జనవరి 12 ప్రభాతవార్త: మేడమ్ నాకు పింఛన్ రావట్లేదు... నాకు ఆధార్ కార్డు లేదు ...ఇలా వృద్ధ మహిళలు చెవిరెడ్డి లక్ష్మీకి విన్నవించుకున్నారు. శుక్రవారం ఎస్వీనగర్‌లో గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమానికి విచ్చేసిన చెవిరెడ్డి లక్ష్మీకి వృద్ధ మహిళలు తమ గోడును వెల్లబుచ్చారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా తనయుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని గెలిపించాలని లక్ష్మీ కోరారు. ప్రజలకు అభివృద్ధి సంక్షేమం జరగాలంటే మోహిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్ళపల్లి గ్రామ సర్పంచ్ జోగి మోహన్‌కుమార్, వైకాపా రాష్ట్ర నేత కొత్తపాటి మునీశ్వరరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

## 30 మంది పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్లు



**వడమాలపేట, జనవరి 12 ప్రభాతవార్త:** స్వయంకృషి జనహిత స్వచ్ఛంద సేవా సంస్థ సర్వీస్ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లకు ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా లైఫ్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. శుక్రవారం ఉదయం వడమాల వ్యవసాయ శాఖ కార్యాలయ ఆవరణలో క్యాంపు నిర్వహించారు. అలాగే మండలంలో ఇంకా ఎవరైనా పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ తీసుకోకుండా ఉంటే క్రింది నెంబర్లను 9866708002, 9440180472 సంప్రదించవచ్చునన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారి విజయకుమార్, ఏపీఎన్‌జీవోస్ పుత్తూరు తాలూకా అసోసియేషన్ ప్రెసిడెంట్ లోకనాథం పాల్గొన్నారు.

## జ్యోతిలక్ష్మికి ఉత్తమ సంఘ సేవ పురస్కారం



**వడమాలపేట, జనవరి 12 ప్రభాతవార్త:** వడమాలపేట మండలం ఎస్వీ పురం గ్రామానికి చెందిన నెహ్రూ యువజన సేవా సంఘం అధ్యక్షురాలు జ్యోతిలక్ష్మి ఉత్తమ సంఘ సేవకురాలు పురస్కారం లభించింది. శుక్రవారం భారత ప్రభుత్వం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో చిత్తూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జిల్లా యూత్ కో-ఆర్డినేటర్ ప్రదీప్‌కుమార్ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ తులసి చేతుల మీదుగా అందుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు పురస్కారం అందుకున్నట్లు జ్యోతిలక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత వెంకమరాజు, సంఘ సభ్యులు నాధముని, మురళి, చిట్టెమ్మ హర్షం వ్యక్తం చేశారు.

## ఉపాధిహామీ పథకంలో అక్రమాలు సహించేది లేదు : పీడీ



**పుత్తూరురూరల్, జనవరి 12 ప్రభాతవార్త:** ఉపాధి హామీ పథకంలో అవినీతి, అక్రమాలు సహిం చేది లేదని పీడీ శ్రీనివాసప్రసాద్ పేర్కొన్నారు. పుత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం 17వ సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందరికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఈ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. రూ.6 వేలు రికవరీ చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ మునివేలు, డీవీవో భాగ్యలక్ష్మి, ఏపీడీ సరిత, ఏపీవో భార్గవి, సర్పంచ్‌లు, క్షేత్ర సహాయకులుపాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్ర వాలీబాల్ విజేతలుగా గాజులమండ్యం టీం



**రేణిగుంట, జనవరి 12 ప్రభాతవార్త:** ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో గాజుల మండ్యం టీం విన్నర్స్ టైటిల్స్ కైవసం చేసుకుంది. 22జట్లు పోటీల్లో పాల్గొనగా గాజులమండ్యం జట్టు ఫైనల్స్ లోవిజేతలుగానిలిచింది. గెలుపుకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ డా. గంగారి రమేష్‌లకు టీం తరపున కెప్టెన్ రాకేష్ ధన్యవాదాలు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులను ఎంపీటీసీలు ధనంజయరెడ్డి, రమణారెడ్డి, గ్రామస్థులు అభినందించారు.

## కోటి హనుమాన్ చాలీసా పారాయణ కరపత్రం ఆవిష్కరణ

**తిరుపతి, జనవరి 12ప్రభాతవార్త:**



విశ్వహిందూ పరిషత్ కేంద్రీయ ప్రబంధ సమితి ఆధ్వర్యంలో కోటి హనుమాన్ చాలీసా పారాయణ కరపత్రం శుక్రవారం ఆవిష్కరణ జరిగింది. టిటిడి ఛైర్మన్ భూమన కరుణా కర్‌రెడ్డి అఖండ హనుమాన్ చాలీసా పారాయణ సప్తాహం కరపత్రం విడుదల చేశారు.

# గూడూరులో సమ ఉజ్జీల మధ్య పోటీ




చిట్టమూరు, జనవరి 12 ప్రభాతవార్త : గూడూరు నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో తలపడే అభ్యర్థులు ఎవరో తేలిపోయింది. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఇప్పటికే ప్రజల్లోకి పాశం సునీల్‌కుమార్ దూసుకుపోతుండగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మేరిగ మురళీధర్‌ను పార్టీ అధిష్టానం ప్రకటించింది. గూడూరు నియోజకవర్గంలో వైసీపీ తరఫున పోటీ చేస్తున్న మేరిగ మురళీ గతంలో తెలుగుదేశం ఎమ్మెల్యేగా పనిచేసిన పాశం సునీల్‌కుమార్ మధ్య తీవ్ర పోటీ ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రతిపక్షంలో వైసీపీ బాధ్యతలు స్వీకరించిన మేరిగ మురళీ గడప గడపకు కార్యక్రమం ద్వారా గూడూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సుపరిచితులయ్యారు. తద్వారా నియోజకవర్గంలోని అన్ని కుటుంబాల కష్టాలను తెలుసుకొని అందరికీ దగ్గరయ్యారు. ఇదే క్రమంలో గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా గతంలో పనిచేశారు. ప్రతి గడపకు తట్టిన సునీల్‌కుమార్ గుర్తుకు వచ్చే విధంగా పలు సమస్యలను పరిష్కరించి ప్రజలకు దగ్గరైన సందర్భాలు అనేకం కనిపిస్తాయి. అయితే ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ ఎత్తుగడలలో భాగంగా వైసీపీ సర్కార్ గూడూరు నియోజకవర్గంపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టి గెలుపు గుర్రానికే అవకాశం అనే విధంగా ఆచితూచి అడుగులు వేయడంపై గూడూరు నియోజకవర్గ వ్యాప్తంగా మేరిగ మురళి ఎంపికపై సంబరాలు జరుపు కుంటున్నారు. ఇప్పటికే గూడూరు నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేసి అభివృద్ధి ప్రదాతగా, పేదల పెన్నిధిగా పేరుగాంచిన గూడూరు టిడిపి అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ తనదైన శైలిలో అందరినీ కలుపుకొని ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటు పాశం సునీల్‌కుమార్, అటు మేరిగ మురళీ మధ్య గూడూరు నియోజకవర్గంలో గట్టి పోటీ ఉంటుందని రాజకీయ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.

## స్వామి వివేకానందుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



కోట, జనవరి 12 ప్రభాతవార్త : స్వామి వివేకానంద జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆయన చిత్రపటానికి విజయకుమార్‌రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్య సాధనకు పట్టుదల, కఠోర సాధన, ఆత్మస్థైర్యం ఉండాలని స్వామి వివేకానంద చెప్పిన మాటలను గుర్తు చేశారు. వివేకానందుని అడుగుజాడల్లో యువత నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ జి.హరినాథరెడ్డి, సమన్వయకర్త ఆర్.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## కళాకారులను ఆధునికీకరణను అలవరచుకోవాలి

**-డాక్టర్ జి.దశరధాచారి**




శ్రీకాళహస్తి, జనవరి 12 ప్రభాతవార్త : కళాకారులు ఆధునికీరణకు అలవరచు కోవాలని చిత్తూరు హ్యాండీ క్రాఫ్ట్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ యండి డాక్టర్ జి.దశరధాచారి కొయ్యబొమ్మల కళాకారులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని కొత్తపేటలో ఉన్న చిత్తూరు హ్యాండీ క్రాఫ్ట్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిడెట్ మరియు కేంద్ర చేనేత జౌళిశాఖ, హస్తకళల అభివృద్ధి సంస్థ నూడిల్లీ సహకారంతో కొయ్యబొమ్మల కళాకారులకు ఆధునిక పరికరాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా యండి దశరధాచారి కొయ్యబొమ్మల కళాకారులకు ఆధునిక పరికరాలను పంపిణీచేశారు. ముఖ్యఅతిధిగా కేంద్రప్రభుత్వ చేనేత, జౌళి మరియు హస్తకళలశాఖ తిరుపతి అసిస్టెంట్ డైరెక్టర్ టి.సత్యమూర్తి చేతులమీదుగా 50మంది కొయ్యబొమ్మల కళాకారులకు ఆధునాతన పరికరాలను అందించారు. గత మూడేళ్ళ నుంచి కొయ్యబొమ్మల కళాకారుల సంక్షేమం మరియు అభివృద్ధి కోసం ఈడిపి శిక్షణ కార్యక్రమం, సిడిపి శిక్షణ, సెమినార్లు మరియు ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయడం జరుగుతోందని దశరధాచారి పేర్కొన్నారు. తాము తయారు చేసిన కొయ్యబొమ్మల ఉత్పత్తులకు సంబంధించిన క్రయ విక్రయాల వివరాలను ప్రపంచానికి తెలియ జేసినందుకు అవసరమైన వెబ్‌సైట్ ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలను ప్రపంచానికి తెలియజేసేందుకు సంస్థ సహకారంతో చేపడుతున్నట్లు దశరధాచారి తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు పిడి.భాస్కర్, పి.రవి ఆచారి, జి.బాలకృష్ణ, జి.బాలాజీ, ఎం.చంద్రాచారి, ఎం.రమేష్, పి.గోపి, పి.మునస్వామి, పి.కుమార్, టి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత సమాజ నాయకులకు... క్యాలెండరును అందజేసిన చేనేత యూనియన్ నాయకులు



వరదయ్యపాలెం, జనవరి 12 ప్రభాతవార్త : వరదయ్యపాలెం మాజీ సర్పంచ్, సీనియర్ టిడిపి నాయకులు పన్నెం బాలసుందరంకు, టిడిపి క్లస్టర్ ఇంచార్జి పన్నెం నిర్మల్ కుమార్‌కు, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్, వరదయ్యపాలెం మాజీ సర్పంచ్, వైసిపి నాయకుడు బొప్పన తిలక్ బాబుకు వరదయ్యపాలెం దేవాంగ సంఘం అధ్యక్షులు పృధ్వీరవికు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపి, 33వ వసంతాలు నిర్విఘ్నంగా జరుగుతున్న చేనేత కార్మిక యూనియన్ 2024 క్యాలెండరును అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆకుల వాసు, శేఖరయ్య, వెంకటరమణయ్య, బుర్రా కృష్ణమూర్తి, జక్కల మునస్వామి, నాప చంద్రమౌళి, గుత్తి త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రెండు వేర్వేరు కేసుల్లో ఆరుగురు స్మగ్లర్లు అరెస్టు

**18 ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం**



తిరుపతి కార్పొరేషన్, జనవరి 12, ప్రభాతవార : రెండు వేర్వేరు సంఘటనల్లో ఆరుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి, 18 ఎర్రచందనం దుంగలు, ఒక కారు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్సు డీఎస్పి మురళిధర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు రేంజి డిఐటి సెంథిల్ కుమార్ ఉత్తర్వులు మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పి శ్రీనివాస్ ఆదేశాలతో డిఎస్పి చెంచుబాబు పర్యవేక్షణలో ఆర్ఎస్ఐ లింగాధర్ టీమ్ గురువారం సాయంత్రం కల్యాణి డ్యాం నుంచి చీకటీగలకోన మీదుగా శ్రీవారి మెట్టు వైపు కూంబింగ్ చేపట్టారు. అర్ధరాత్రి సమయంలో భాకరాపేట రేంజ్ నాగపట్ల ఈస్ట్ ఫారెస్టు బీటు పరిధిలో కొంత మంది వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. వారిని టాస్క్ ఫోర్సు టీం చుట్టు ముట్టగా వారు రాళ్లు, కొడవళ్లతో దాడి చేసి పారిపోయే ప్రయత్నం చేసారు. అయితే వారిలో తమిళనాడు, తిరువన్నామలై జిల్లా జమునామత్తూరుకు చెందిన మణి (37)ను పట్టుకనానరు. స్మగ్లర్లు పడేసిన 11 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. మరో సంఘటనలో రైల్వే కోడూరు టాస్క్ ఫోర్సు ఆర్ఎస్ఐ ఆలీభాషా టీమ్ నాయుడు పేట వైపు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు తనిఖీ చేసుకుని వెళుతూ, గూడూరు – నాయుడుపేట హైవే రోడ్డు మీద బుధానం టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. శుక్రవారం ఉదయం ఒక కారులోని వ్యక్తులు వాహనం వదిలి పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో టాస్క్ ఫోర్సు టీమ్ వారిని చుట్టుముట్టి కారులో తనిఖీలు చేయగా అందులో 7 ఎర్రచందనం దుంగలు కనిపించాయి. వాటిని కారుతో పాటు స్వాధీనం చేసుకుని ఐదుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. ఈ రెండు కేసులోని దుంగలు విలువ సుమారు రూ. 20 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ఈ కేసులను సిఐ శ్రీనివాస్, ఎస్ఐ రఫీ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సిబ్బందికి ఎస్పీ పి.శ్రీనివాస్ అభినందించి, రివార్డులను ప్రకటించారు.

## గజవాహనంపై విహరించిన శ్రీవారి దేవేరి



తిరుచానూరు, జనవరి 12 ప్రభాతవార్త : తిరుచానూరు తిరుమాడ వీధులలో గజవాహనంపై శ్రీవారి దేవేరి అలివేలు మంగ విహరించారు. అమ్మవారి జన్మ నక్షత్రం, ఉత్తరాషాడ సందర్భంగా సాయంత్రం అమ్మవారు తిరుమాడ వీధులలో గజ వాహనం పై కొలువుదీరి భక్తులకు అభయమిచ్చారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేలుకొలిపి సహస్రనామ అర్చన, నిత్య అర్చన చేపట్టారు. అనంతరం ఆలయ ముఖ మండపం వద్ద స్నపన తిరుమంజనం చేపట్టారు. తరువాత కళ్యాణోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉద్యానవనంలో స్నపన తిరుమంజనం చేపట్టారు. తరువాత కళ్యాణోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉద్యానవనంలో స్నపన తిరుమంజనం చేపట్టారు. అనంతరం అమ్మవారిని మాఢవీధులలో విహరించారు. విశేష గజవాహనం సందర్భంగా భక్తులు స్థానికులు కొబ్బరకాయలు, కర్పూర హారతులతో మొక్కులు చెల్లుంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీవాణి, అర్జిత ఇన్స్‌పెక్టర్ గణేష్, ప్రసాదం ఇన్స్‌ఫెక్టర్ ప్రసాద్, టెంపుల్ ఇన్స్‌ఫెక్టర్లు, ఆలయ అర్చకులు, విజిలెన్స్ అధికారులు ఇతర టిటిడి సిబ్బంది పాల్గొన్నారు.

# యువతకు స్ఫూర్తిప్రదాత స్వామి వివేకానంద

**-ఆర్.కె. అబాకస్ అధినేత డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి**



తిరుపతిరూరల్, జనవరి 12 ప్రభాతవార్త: యువతకు స్ఫూర్తిప్రదాత స్వామి వివేకానంద అని ఆర్.కె.అబాకస్ అధినేత తాతిరెడ్డి డాక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ముత్యాలరెడ్డిపల్లి, కె.టి.రోడ్డులో గల ఆర్.కె. అబాకస్ శిక్షణా కేంద్రాలలో వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ యువతకు ఆదర్శప్రాయుడు వివేకానందుడని, నేటి యువత వివేకానందుడు అడుగు జాడల్లో నడవాలని సూచించారు. దేశ ప్రతిష్టను విశ్వవ్యాప్తం చేసిన చైతన్యమూర్తి స్వామి వివేకానందకే దక్కుతుందన్నారు. భారతీయుల సంస్కృతి, సాంప్రదాయాలను ప్రపంచ నలుమూలలకు తెలియజేసారని తెలిపారు. వాక్ చాతుర్యంతో యువతను మేల్కొల్పుతూ ఉత్సాహభరితమైన ప్రసంగాలు చేస్తూ యువతలో ప్రోత్సాహన్ని నింపారని తెలిపారు. చినిగిన చొక్కానైన తొడుక్కో...కానీ కొత్త పుస్తకాన్ని కొనుక్కోమని పిల్లలను ఉద్దేశించి చెప్పారని తెలిపారు. యువజనోత్సవాన్ని ముఖ్యఅతిధిగా విచ్చేసిన డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిల్లలు రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, అబ్దుల్ కలామ్ వంటి మేధావులను ఆదర్శంగా తీసుకుని, ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఆర్.కె.అబాకస్ డైరెక్టర్ ఆర్కె విమల మాట్లాడుతూ పిల్లలు ప్రతిదినం తమ కర్తవ్యాలను త్రికర్ణశుద్ధితో ఆచరిస్తూ, ఇటు విద్యాసంస్థలకు సమాజం పట్ల అంకిత భావంతో.. పెద్దల పట్ల గౌరవం, ఉపాధ్యాయులతో వినయ విధేయుతతో కలిసి మెలిసి, విద్య కొనసాగిస్తే విద్య సంపూర్ణం అవుతుందన్నారు. అనంతరం పిల్లలకు స్వామి వివేకానంద పుస్తకాలను బహుమతిగా అందజేసారు.

## శ్రీచెంగాళమ్మ నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



సూళ్లూరుపేట, జనవరి 12 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం లక్ష రూపాయలు విరాళం అందింది. వైజాగ్‌కు చెందిన అడారి ధాన్విక కుటుంబ సభ్యులు ఈ విరాళం మొత్తాన్ని ధర్మ కర్తల మండలి సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్‌రెడ్డి చేతులు మీదుగా దేవస్థానానికి అందజేశారు.

## నిమ్మలో సూక్షదాతు లోపాలు నివారింపై అవగహన

**- పెట్లూరు నిమ్మ చీనీ పరిశోదన కేంద్రం అధిపతి డాక్టర్ సి మధుమతి**



వెంకటగిరిరూరల్ జనవరి12 ప్రభాతవార్త: గ్రామీణ ప్రాంతాల లోని నిమ్మ రైతులకు అర్క సిట్రస్ స్పెషల్ ( సూక్షధాతు మిశ్రమం) యొక్క అవశ్యకత గురించి గ్రామీణ ఉద్యాన కృషి అవగాహన కార్యక్రమంలో భాగంగా అనంత రాజుపేట ఉద్యాన కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు పెట్లూరు నిమ్మ చీనీ పరిశోదన కేంద్రం అదిపతి డాక్టర్ సి మధుమతి తెలియజేశారు. ఆమె మాట్లడుతూ ఈ మద్య కాలంలో రైతులు సిఫార్సు చేసినదాని కన్న ఎక్కువ రసాయనిక ఎరువులు వాడకం తగ్గించడం వల్ల మరియు వెంకటగిరి, రాపూరు, డక్కిలి, తోపాటు నెల్లూరు తిరుపతి జిల్లా నేలల్లో నిమ్మను ఎక్కువ గా సాగు చేయడం వల్ల మొక్కలు విధవిధ రకాలు సూక్షధాతు లోపాలకు గురి కావడం వల్ల చెట్లు ఆరోగ్యంగా లేక పోవడం పూత పిందే సరిగ్గా ఎర్పాడక పోవడం మరియు దిగుబడులు అనుకున్న స్థాయిలో రాక పోవడం జరుగుతుందన్నారు. అదే విధంగా విటిని నివారించడం కోరకు భారతీయ ఉద్యన వన పరిశోదన సంస్ధ బెంగుళురు వారి అర్కా సిట్రస్ స్పెషల్ ( సూక్షధాతు మిశ్రమం)ను రూపోందించారు. ఈ మిశ్రమాన్ని నిమ్మలో పిచికారి చేసే విదానాన్ని క్షేత్ర ప్రదర్శన ద్వార మన్నెగుంట గ్రామ నిమ్మ రైతులకు అవగహన కల్పించడం జరిగినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రైతులు పాల్గొన్నారు.

## గంగమ్మకు రాహుకాలాభిషేకం



బోయకొండ(చౌడేపల్లి), జనవరి 12 ప్రభాతవార్త : శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు రాహుకాలాభిషేకం జరిగింది. ఉదయాన్నే వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. రాహుకాల సమయంలో దంపతుల సమక్షంలో పలు కార్యక్రమాలు జరిగాయి. అనంతరం పుష్కరిణీ వద్ద ఉచిత అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. పలమనేరు సిఎస్.నవీన్‌కుమార్ ఆయన మిత్రులు అన్నదానానికి కూరగాయలు సమకూర్చారు. ఛైర్మన్ నాగరాజరెడ్డి, ఇఓ చంద్రమౌళి, అధికార, అర్చక, సిబ్బంది సేవలందించారు.

## కాణిపాకం ఆలయానికి 3.03 లక్షలు విరాళం



కాణిపాకం, జనవరి 12 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి పథకాలకు ఓ భక్తుడు శుక్రవారం 3.03 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు విశాఖపట్నంకు చెందిన వెంకట సత్యనారాయణమూర్తి అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు ఒక లక్ష రూపాయలను, సిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు ఒక లక్ష రూపాయలను, దేవస్థానం అభివృద్ధి పనులకు ఒక లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని చెక్ రూపంలో కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఆలయ సూపరెంటెంట్ శ్రీధర్‌బాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్‌లకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్ధ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## యువత వివేకానంద స్ఫూర్తితో దేశసేవకు రావాలి

**- బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్**

**- కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఘనంగా యువజన దినోత్సవం**




కుప్పం, జనవరి 12 ప్రభాతవార్త : యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని దేశసేవకు ముందుకు రావాలని బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో జాతీయ యువజన దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ఆధ్యాత్మికత, గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు వివేకానందుడు అన్నారు. ఆయన ప్రసంగాలు యువతలో చైతన్యం కలిగిస్తాయన్నారు. వివేకానందుడి తత్వాలు, బోధనలు, ఆలోచనలు దేశానికి గొప్ప స ంస్కృతి, సంప్రదాయ ఆస్తులన్నారు. యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, ఆర్అండ్‌డి డైరెక్టర్ డా॥ కోదండరామయ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మాధవన్, గంగాధరం, హెచ్ఓడిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలోప్రముఖులు



తిరుమల, జనవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం ప్రముఖులు దర్శించు కున్నారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో సపాయి కర్మచార జాతీయ కమిషన్ సభ్యుడు పిపి వవ, ఎంఎల్‌సి మాణిక్యవరప్రసాద్ ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## 15నుండి శ్రీవారికి సుప్రభాతసేవ



తిరుమల, జనవరి 12ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజామున మేల్కొలిపే సుప్రభాతంసేవ తిరిగి 15వతేదీ సోమవారం నుండి పునఃప్రారంభం కానుంది. ధనుర్మాసంలో డిసెంబర్ 17వతేదీ నుండి 2024 జనవరి 14వతేదీ వరకు తిరుప్పావై ప్రవచనాలు పఠిస్తున్నారు. 14వతేదీకి ధనుర్మాసం ముగియనుండటంతో 15వతేదీ నుండి తిరిగి సుప్రభాతసేవ పునరుద్దరణ జరుగుతుంది.

## యువత జీవితాలు నిర్వీర్యంతో... తెలుగుయువత వినూత్ననిరసన



తిరుపతి, జనవరి 12ప్రభాతవార్త: రాష్ట్రంలో వైఎస్ఆర్‌కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని, ప్రతి ఏటా జాబ్‌క్యాలండర్‌తో ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేశారని తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రవినాయుడు ఆరోపించారు. ముఖ్యమంత్రి జాబ్‌క్యాలండర్ అమలుచేయక పోగా యువతను మాంసం, చేపల దుకాణాల్లో పనిచేసే స్థాయికి తీసుకొచ్చారని, ఉద్యోగాలు అడిగితే గంజాయి.డ్రగ్స్, మద్యం కేసుల్లో ఇబ్బందిపెడుతూన్నాడని ఆరోపిస్తూ వినూత్నంగా తెలుగుయువత నాయకులు మాంసం, చేపల దుకాణాల్లో పనిచేసి నిరసన తెలిపారు. ఈ వినూత్న నిరసనలో తెలుగుయువత నాయకులు కృష్ణయాదవ్, ఆర్‌పి శ్రీనివాసులు, పెరుమాల్ మధుబాబు, దిలీప్‌రాయల్, నవీన్, నాగరాజు రెడ్డి, హేమంత్‌రాయల్ తదితులు పాల్గొన్నారు.

## ఎంజి కొత్త ఆస్టర్ వాహనం విడుదల




తిరుపతి, జనవరి 12ప్రభాతవార్త: కెశ్విన్ ఆటోమోటార్స్ 2024 ఎంజి ఆస్టర్ కొత్త వాహనాన్ని శుక్రవారం సాయంత్రం మార్కెట్లోకి విడుదల చేసింది. తిరుపతి, కర్నూలు, అనంతపురం, నెల్లూరులోని శాఖల్లో ఈ వాహనం వినియోగదారులకు అందు బాటులో ఉందని, వాహనం ప్రారంభధర 9.98 లక్షల రూపాయలని తెలిపారు. షోరూమ్ అధినేత ఆర్.ఉదయ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎడిఎఎస్ ఎల్ 2 పీచర్లతో 49 సేఫ్టీఫీచర్స్ ఉన్నాయన్నారు. సంక్రాంతి సందర్భంగా ప్రతి ఎంజి వాహనం కొనుగోలుపై బంగారునాణెంతో బాటు 2లక్షల రూపాయలు నగదు తగ్గింపు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ బి.సుబ్రమణ్యం, సందానిభాషా, యుబిఐ చీఫ్ మేనేజర్లు శేషసాయి. రాకేష్, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

## సత్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి: ఇఓ



శ్రీకాళహస్తి, జనవరి 12 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న సంస్థలు, సత్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని వృద్దులు, జంతువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆలయ ఇఓ కె.యస్.రామారావు సూచించారు. ఇఓ ఆలయ డెప్యూటీ ఇవో ఎన్ ఆర్ కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ అధికారులతో కలసి వృద్ధాశ్రమాన్ని పరిశీలించారు. ఇక్కడ పండు ముసలివారిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితుల్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే డాక్టర్లను పిలిపించి అడిగి తెలుసుకున్నారు. అంతేకాక ఇక్కడ నివాసముంటున్న వారు ఎంతో బాగా బతికిన వారు వృద్ధాప్యంలో ఇలా ఉన్నారు. కాబట్టి వారికి ఎలాంటి లోటు రాకుండా చూసుకోవాలని సూచించారు. ఎప్పటి కప్పుడు వారి ఆరోగ్య పరిస్థితి పరిశీలించుకుంటూ వైద్యసదుపాయాలు కల్పించాలని సూచించారు. కాగా గంగా సదన్ వద్ద ఏర్పాటు చేసిన కుందేలు షెడ్డులో ఉన్న కుందేళ్ళను పరిశీలించారు. ఇక వాటికి అందిస్తున్న ఆహారం దాణాను పరిశీలించారు. పోషక ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఇఇ నూకారత్నం, సురేష్, ఆలయాధికారులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ స్థాయిలో ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేస్తాం

**-జర్నలిజం విలువలు, పాత్రికేయులు సంక్షేమానికి పెద్దపీట -బొజ్జలసుధీర్‌రెడ్డి**



శ్రీకాళహస్తి, జనవరి 12 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేస్తామని జర్నలిజం విలువలు, పాత్రికేయుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఊరందూరు గ్రామంలోని ఆయన నివాసంలో శ్రీకాళహస్తి, శ్రీకాళహస్తిరూరల్, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలా లకు చెందిన పాత్రికేయులతో ముఖాముఖి కార్యక్రమాన్నిఏర్పాటు చేశారు. ఈసందర్భంగా బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాట్లాడుతూ తాను శాసనసభ్యుడు అయితే పాత్రికేయులు సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన పత్రికా స్వేచ్ఛను కాపాడడానికి ప్రభుత్వాలు సహకరించాలని ఆయన తెలిపారు. ఇటీవల కాలంలో జర్నలిజం విలువలు దిగజారిపోతున్నా యని అయితే కొందరు సీనియర్ పాత్రికేయులు ఉన్నందువల్లనే ఇంకా విలువలు ఉన్నాయని తెలిపారు. పాత్రికేయులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని సౌకర్యాలు తెప్పిస్తానన్నారు. సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షులు విజయకుమార్, మాజీ మార్కెట్, పాలసరఫరా ఛైర్మన్‌లు రంగినేని చెంచయ్యనాయుడు, మునిరాజనాయుడు, బత్తిరెడ్డి, పొన్నారావు తదితరులు పాల్గొన్నారు.